PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 133 | విజయవాడ, శుక్రవారం 15 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 15 December 2023 | Rs

అప్పులు చేసి పంటలు సాగుచేశాం

- వర్షాభావంతో పంటలన్నీ ఎండిపోయాయి
- ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం ఎదుట రైతుల ఆవేదన

లోపలి పేజీలో..



మాకినేని బసవపున్నయ్య జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, మధు తదితరులు

బసవపున్నయ్య బాటలో విజ్ఞాన కేంద్రం

- జయంతి సభలో ఛైర్మన్ పి మధు

లోపలి పేజీలో..



సుజలధార ప్రాజెక్టు పంపు మోటార్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- మూలాల అన్వేషణకు సమగ్ర అధ్యయనం
- ఫిబ్రవరిలో ఉద్దానంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్
- పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో కిడ్నీ సమస్యలు ఎక్కడ ఉన్నా, వాటి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, కంచిలి మండలం మకరాంపురంలో రూ.700 కోట్లతో నిర్మించిన వైఎస్ఆర్ సుజలధార ప్రాజెక్టును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే క్రీడా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత ప్రమాణాలతో వైద్యసేవలు అందించేందుకు అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో కలిసి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. వచ్చే ఫిబ్రవరిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేపట్టబోతున్నామని, తద్వారా ఇక్కడ శస్త్రచికిత్సలూ జరగబోతున్నాయని వెల్లడించారు. రీసెర్చ్ ల్యాబ్‌లు, అత్యాధునిక సిటి స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, యూరాలజీకి అవసరమైన హూల్మియం లేజర్, యూరో డైనమిక్ వంటి ఆధునిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. కిడ్నీ రోగులకు అన్ని పిహెచ్‌సిల్లో 37 రకాల ఔషధాలను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలో వీటిని విలేజ్ క్లినిక్‌లకు అనుసంధానం చేసి ఇళ్లకే అందించనున్నామని చెప్పారు. కిడ్నీ వ్యాధి మూలాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఐసిఎంఆర్‌తో పాటు అంతర్జాతీయ సంస్థ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌తో కలిసి నాలుగు దశల్లో సమగ్ర అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మూడు దశలు పూర్తయ్యాయన్నారు. కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాబోయే రోజుల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నోడల్ సెంటర్‌గా వ్యవహరించబోతుందన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు శాశ్వత పరిష్కారం కోసం రూ.700 కోట్లను ఖర్చు చేసి వైఎస్ఆర్ సుజలధార ప్రాజెక్టు ద్వారా 807 గ్రామాలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని చెప్పారు. ఉద్దానం మాదిరిగానే ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఉపరితల జలాలను అందించేందుకు వెలుగొండ టన్నెల్ పనులను వేగవంతం చేస్తున్నామని, వచ్చే నెలలో దాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలరావు, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, రెవెన్యూ మిగతా 7లో

మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

- 18 నుంచి టెన్త్: మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటి నుంచి జరుగుతాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెండు పరీక్షల షెడ్యూల్‌ను విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. మార్చి ఒకటి నుంచి 20 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం మొత్తం 10 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు జరగనున్నాయి. వొకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు జరుగుతాయి. నైతిక, మానవ విలువల సబ్జెక్టు ఫిబ్రవరి 2న, పర్యావరణ విద్య సబ్జెక్టు ఫిబ్రవరి 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనుంది. సమగ్ర శిక్షా వొకేషనల్ ట్రేడ్ ఎగ్జామినేషన్ ఫిబ్రవరి 22న జరగనుంది. మార్చి 18 నుంచి 30 వరకు 6 లక్షల మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షలకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకున్నా మని మంత్రి బొత్స చెప్పారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించను న్నామని తెలిపారు. డిసెంబరు 21న ట్యాబులను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్, సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి పాల్గొన్నారు.

టైంటేబుల్స్ 2వ పేజీలో

తాళాలు బద్దలు కొట్టినా...

అదరం...బెదరం

- పట్టు వీడని అంగన్‌వాడీలు
- కొనసాగుతున్న సమ్మె
- సిఎస్‌ను కలిసి నిరసన తెలిపిన కార్మికసంఘాలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లచీరలతో ప్రదర్శన



అంబేద్కర్ కోనసీమ జిల్లా జగ్గంపేటలో అంగన్‌వాడీ కేంద్రం తాళాన్ని పగులగొడుతున్న సచివాలయ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్కారు బెదిరింపులను, సమ్మె విచ్ఛిన్న చర్యలను అంగన్‌వాడీలు బేఖాతరు చేశారు. కేంద్రాల తాళాలను బద్దలు కొడుతున్నా, సచివాలయ సిబ్బంది స్వాధీనం చేసుకుంటున్నా ... వారు వెనకడుగు వేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మూడవరోజైన గురువారమూ సమ్మెను శాంతియుతంగా కొనసాగించారు. పై నుండి అందిన ఆదేశాలతో అధికారులు విధ్వంసకాండకు దిగుతున్నా బెదరలేదు. చట్టాన్ని కాపాడాల్సిన సర్కారే దానిని ధిక్కరించి బహిరంగంగా జులుంకు దిగినా నీరుగారలేదు. మరింత సంఘటితమయ్యారు. శాంతియుత పద్ధతుల్లో సమ్మెను ఉధృతం చేయాలని నిర్ణయించారు. గురువారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా కనిపించిన దృశ్యాలివి. ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో అధికారులు బెదిరింపు చర్యలకు దిగారు. ప్రతి జిల్లాలోనూ కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి వాటి తాళాలను బద్దలుగొట్టి, వివిధ శాఖల సిబ్బందికి నిర్వహణ బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడం చట్ట ప్రకారం నేరం. అయినా, అధికారులే వివిధ శాఖల సిబ్బందికి ఆ దిశలో ఆదేశాలిచ్చి తాళాలు పగలకొట్టించారు. ఒకవైపు ఈ విధ్వంస కాండ జరుగుతుండగా, మరోవైపు దమనకాండకు నిరసనగా ఉవ్వెత్తున అంగన్‌వాడీలు నినదించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు (శుక్రవారంనాడు) రాష్ట్ర వ్యాప్తంగా నల్లచీరలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించారు. మండల కేంద్రాలు, ప్రాజెక్టు కేంద్రాల వద్ద ఈ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అనంతరం ఎంఆర్‌ఓ లేదా ఎండిఓలకు వినతిపత్రాలు ఇవ్వాలని సంఘాలు పిలుపునిచ్చాయి. అనేకచోట్ల అంగన్‌వాడీలకు మద్దతుగా స్థానిక ప్రజానీకం నిలుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. పలు జిల్లాల్లో తాళాలు బద్దలు కొట్టే చర్యలను ప్రజానీకం అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు. నేడు జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అంగన్‌వాడీల సమ్మెపై చర్చించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని గురువారం సాయంత్రం కలిసిన కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వ తీరు పట్ల నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉంటే అధికారులు తాళాలు పగులకొట్టించే చర్యలకు దిగడం సరికాదని సిఎస్‌కు తెలిపారు. ఈ ఘటనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మిగతా 7లో

సమస్యలను వెంటనే పరిష్కరించి అంగన్‌వాడీల సమ్మెను ఆపించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

లోపలి పేజీలో..



విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

కనీస వేతనం కోసం 36 గంటల దీక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆశాల వంటా-వార్పు
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలి : ధనలక్ష్మి

లోపలి పేజీలో..

ఇసి వద్దకు నకిలీ ఓట్ల వ్యవహారం

- వైసిపి, టిడిపి పరస్పర ఫిర్యాదు
- బిజెపి కూడా..

లోపలి పేజీలో..

విశాఖ ఇండస్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం



రోగులను రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



భద్రతా వైఫల్యంపై చర్చ చేపట్టాలని లోక్‌సభ స్పీకర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

14 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు

- సభలో లేని డిఎంకె ఎంపి పైనా.. ఆ తరువాత వెనక్కి
- భద్రతా వైఫల్యంపై చర్చకు పట్టుబట్టిన ప్రతిపక్షం
- తిరస్కరించిన ప్రభుత్వం
- ఆందోళనతో దద్దరిల్లిన ఉభయ సభలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం గురువారం ఉభయ సభలను కుదిపేసింది. బిజెపి ఎంపీ ఇచ్చిన పాస్ సాయంతో పార్లమెంటులోకి ఇద్దరు యువకులు ప్రవేశించి పొగబాంబులు పేల్చిన ఘటనపై చర్చ జరగాలని పట్టుబట్టినందుకు 14 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారు. సభలో లేని డిఎంకె ఎంపీ పార్థిబన్‌పైనా సస్పెన్షన్ విధించి, ఆ తరువాత పొరపాటైందంటూ ఆయనపై వేటును ఎత్తేశారు. లోక్‌సభలో మిగతా 7లో

రైతాంగ మేథోమథనం



ఎర్రజెండాలతో కొండారెడ్డి బురుజు వద్ద అలంకరణ

- నేటి నుంచి ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం
- ముస్తాబైన కర్నూలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రైతాంగ మేథోమథనానికి రంగం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతో పాటు, దేశం ముందున్న వివిధ అంశాలను చర్చించి, కార్యాచరణను రూపొందించ డానికి కర్నూలులో నేటి నుండి జరగనున్న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం వేదిక కానుంది. ప్రతిష్టా త్మకంగా జరగున్న ఈ జాతీయ కౌన్సిల్‌కు కర్నూలు నగరం ముస్తాబైంది. నగరంలోని కలెక్టరేట్ కూడలి, సుందరయ్య కూడలి, ఆర్‌ఎస్ రోడ్డు కూడలి, గాయత్రి ఎస్టేట్ కూడళ్లను ఎఐకెఎస్ తోరణాలతో ముస్తాబు చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు 27 రాష్ట్రాల నుంచి 140 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, టి.సాగర్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాద్‌తో పాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, నోయిడాలో రైతు ఉద్యమం నడిపిన నాయకులు, వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితులు హాజరుకానున్నారు. తొలిరోజు శుక్రవారం ఉదయం ప్రారంభ సభ, కార్యదర్శి నివేదిక, మధ్యాహ్నం కర్నూలు సుందరయ్య కూడలి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ రైతు ర్యాలీ కొనసాగుతుంది. అనంతరం నాలుగు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. శనివారం, ఆదివారం కార్యదర్శి నివేదికపై చర్చలు, తీర్మానాలు కొనసాగనున్నాయి. కర్నూలు బస్టాండు సమీపంలోని సత్య ఇన్ హోటల్‌లో ఈ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల వేదికకు స్వాతంత్ర సమరయోధుడు, తమిళనాడు రైతు ఉద్యమ నాయకులు శంకరయ్య పేరుతో శంకరయ్య నగర్‌గా నామకరణం చేశారు. సమావేశాల నిర్వహణ కోసం 20 సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. మద్దతు ధరల చట్టం, విద్యుత్ రంగ సంస్కరణలు, సమగ్ర పంటల బీమా, రైతుల రుణమాఫీ, పౌర హక్కులు, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, ఫెడరల్ వ్యవస్థను రక్షించుకోవడం ప్రధాన అంశాలుగా చర్చలు సాగనున్నాయి. గురువారం సాయంత్రానికే ముఖ్య నాయకులు కర్నూలుకు చేరుకున్నారు.

తెలంగాణలో మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడేషన్

- మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 3989 మినీ అంగన్ వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌కు గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. 3989 మంది అంగన్‌వాడీ సహాయకులను అదనంగా నియమించుకోవడానికి, 35,700 అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల నాలుగు రకాల బరువు, ఎత్తు కొలుచేందుకు పోషణ్ అభియాన్ 2.0 పథకం క్రింద 28.56 కోట్ల రూపాయల మంజూరుకు సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రిగా ధనసరి అనసూయ (సీతక్క) బాధ్యతలు స్వీకరించారు. ఈ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు అదనంగా ఇద్దరు శిశు సంరక్షకులను నియామకం కోసం రూ.1,27,24,800 నిధులను కేటాయించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో 200 వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాలను మండల సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

సందిగ్ధంలో బీమా!

- ఖరీఫ్‌కు తన వాటా ప్రీమియం చెల్లించని రాష్ట్రం
- దాటవేతలో కేంద్రం
- కరువు, తుపాన్ రైతుల ఆందోళన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంటల బీమా విషయంలో సందిగ్ధత నెలకొంది. ఖరీఫ్ ముగిసి రెండున్నర నెలలవుతున్నా బీమా ఉందో లేదో తెలీకుండా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తన వంతు ప్రీమియం చెల్లించలేదని తెలుస్తోంది. ఉచిత పంటల బీమా కావడంతో ప్రీమియంలో రైతుల వాటా కూడా రాష్ట్ర సర్కారే చెల్లించాలి. రైతుల వాటా సైతం కంపెనీలకు చేరకపోవడంతో కేంద్రం నుంచి బీమా పథకాలకు ఆమోదం లభించలేదు. రాష్ట్రం తన వాటా ప్రీమియం చెల్లించనందున అటు కేంద్రమూ తాను భరించాల్సిన ప్రీమియం భాగాన్ని కంపెనీలకు బదలాయించలేదు. దాంతో ఖరీఫ్‌లో ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా ప్రశ్నార్థకంగా మారాయి. ఒకే సీజన్‌లో కరువు, తుపాన్ లక్షల ఎకరాల్లో పంటలను సర్వనాశనం చేశాయి. రైతులు పెట్టుబడులు నష్టపోయారు. కరువు పీడిత, తుపాన్ బాధిత ప్రాంతాల్లో కేంద్ర బృందాలు తిరుగుతున్నాయి. కేంద్ర నిబంధనల ప్రకారం ఖరీఫ్ బీమా ప్రీమియం చెల్లింపులకు గడువు ముగిసిందని చెబుతున్నారు. అదే జరిగితే విపత్తుల వలన అపార పంట నష్టాలు చవి చూసిన రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఫసల్‌లో చేరాక తిప్పలు

కేంద్రం నుంచి విడగొట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం 2019-20 రబీ నుంచి 2021-22 రబీ వరకు తానే స్వయంగా బీమా పథకాలు నిర్వహించింది. కంపెనీలతో సంబంధం లేకుండా కేంద్ర మార్గదర్శకాలకు లోబడి కొంచెం అటు ఇటుగా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టాలకు ఆ సీజన్‌లోనే బీమా పరిహారం సెటిల్ చేసింది. ఇక్కడ కూడా నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందలేదన్న విమర్శలున్నాయి. కాగా కేంద్రం ఒత్తిడి మేరకు 2022 ఖరీఫ్ నుంచి ఫసల్ బీమాలో రాష్ట్రం చేరింది. అప్పటి నుంచి కంపెనీలకు ప్రీమియం చెల్లింపులు తిరిగి మొదలయ్యాయి. గతేడాది ఖరీఫ్, రబీలో దిగుబడి ఆధారిత బీమా (ఫసల్)ను కంపెనీలు నిర్వహించగా, వాతావరణ బీమాను రాష్ట్ర సర్కారే ఇంప్లిమెంట్ చేసింది. గత ఖరీఫ్‌లో 75 లక్షల మంది రైతులు ఫసల్‌కు దరఖాస్తు చేసుకోగా 25 లక్షల మందే లర్హత సాధించారు. 50 లక్షల ఎకరాలు బీమా పరిధిలోకొచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కంపెనీలకు రూ.1,800 కోట్లకుపైన ప్రీమియం చెల్లించగా, ఆ ఏడాది రైతులకు కంపెనీలు చెల్లించిన పరిహారం రూ.600 కోట్లు కూడా లేదు. 2022 రబీ బీమా నేటికీ రాలేదు.

రబీ వచ్చినా..

ప్రస్తుత 2023 ఖరీఫ్‌లో ఫసల్, వాతావరణ రెండు పథకాలనూ కంపెనీలకు అప్పగించారు. ఫసల్‌లో కొన్ని ప్రభుత్వరంగ సంస్థలుండగా, వాతావరణ బీమాను అచ్చంగా ప్రైవేటు కంపెనీలకే ఇచ్చారు. సెప్టెంబర్ ఆఖరుకు ఖరీఫ్ ముగిసింది. డిసెంబర్ సగంలో పడ్డా బీమా ఉందో లేదో అయోమయం నెలకొంది. ఇ-క్రాప్‌లో నమోదైన రైతులందరికీ బీమా వర్తిస్తుందన్నారు. ఇ-క్రాప్ అక్టోబర్ చివరి వరకు సాగింది. పైగా లోపభూయిష్టంగా, తప్పుల తడకగా ఉంది. కౌలు రైతులకు ఎంట్రీ లేదు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు జరుగుతున్నాయి. దిగుబడి ఆధారిత బీమాకు ఆ డేటానే ప్రామాణికం. వాతావరణ బీమాకు ఎపిఎస్‌పిపిఎస్ డేటా ఆధారం. కేంద్ర సమాచారం మేరకు ఫసల్ బీమాలో ఇప్పటి వరకు రాష్ట్రం నుంచి మూడు జిల్లాల్లో 36 మంది మిగతా 2లో

విద్యుత్ పొదుపులో రాష్ట్రానికి మొదటి స్థానం

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎపిఎస్ఇసిఎం సిఇఒ బిఎవిపి కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పొదుపు, పరిరక్షణలో రాష్ట్రం మొదటి స్థానం సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఇంధన పరిరక్షణ సమితి సిఇఒ బిఎవిపి కుమార్ రెడ్డి గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందుకున్నారు. 5 నుంచి 15 మిలియన్ టన్నుల చమురు సమానమైన విద్యుత్ పొదుపునకు సంబంధించిన గ్రూప్-2లో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహాయ, సహకారాలు, మార్గదర్శకత్వం, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వినియోగదారుల భాగస్వామ్యంతో ఈ అవార్డు సాధించినట్లు తెలిపారు. విద్యుత్ పొదుపును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విభాగాల్లో నోడల్ అధికారులతో ఎనర్జీ కన్సర్వేషన్ సెల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గృహ, పరిశ్రమ, వ్యవసాయ, భవనాల్లో రూ.4 వేలకోట్ల సమానమైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు చేసే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రులు, వాణిజ్య, నివాస భవనాల్లో విద్యుత్ పొదుపును ప్రోత్సహించేందుకు ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఇసిబిసి) అమలులో ప్రధాన పురోగతిని ఇంధన పరిరక్షణ సమితి సాధించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ శాఖలతోపాటు ఆర్‌టిసిలో విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు కోసం వివిధ రంగాల్లో ప్రత్యేక బడ్జెట్‌ను అందించిందన్నారు. ఇంధన పరిరక్షణ సమితికి సహకరించి ఈ విజయానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి, బిఇఇలకు సిఇఒ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసి వద్దకు నకిలీ ఓట్ల వ్యవహారం

- వైసిపి, టిడిపి పరస్పర ఫిర్యాదు
- బిజెపి కూడా..


మీడియాతో మాట్లాడుతున్న విజయసాయి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో నకిలీ ఓట్ల వ్యవహారం కేంద్ర ఎన్నికల సంఘం వద్దకు చేరింది. ఇప్పటికే పలుసార్లు వైసిపి, టిడిపి పరస్పర ఫిర్యాదులు చేసుకున్నాయి. తాజాగా గురువారం మళ్లీ నకిలీ ఓట్ల వ్యవహారంపై వైసిపి, టిడిపి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో వైసిపి ఎంపిలు వి విజయసాయిరెడ్డి, ఎ అయోధ్యారామిరెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి, భీశెట్టి సత్యవతి, మద్దిల గురుమూర్తి సమావేశమయ్యారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఐదు అంశాలు ఇసికి వివరించామని అన్నారు. చట్ట విరుద్ధంగా టిడిపి వ్యవహరిస్తుందని తెలిపామన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనలు ఉల్లంఘించేలా 'మై పార్టీ డాష్ బోర్డ్ డాట్ కామ్' ద్వారా ఓటర్ వివరాలు టిడిపి నమోదు చేస్తుందని అన్నారు. అమెరికా సర్వర్‌లో ఓటర్ డేటా స్టోర్ చేస్తున్నారని పేర్కొన్నారు. 'సేవామిత్ర' అనే అప్లికేషన్‌పై గతంలో చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన ఎఫ్ఐఆర్‌లో పురోగతి లేదని ఇసికి తెలిపామన్నారు. టిడిపి చట్ట వ్యతిరేక కార్యకలపాలపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. 30 ఇళ్లకు ఏజెంట్లను నియమించి ఇమేజ్ మోడ్‌లో ఉన్న డేటాను ఎక్సెల్ ఫార్మాట్‌లోకి మారుస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి మేనిఫెస్టో డాట్ కామ్ ఎన్నికల నియమావళిని ఉల్లంగిస్తోందన్నారు. వ్యక్తి పేరు, ఇంటిపేరు, తండ్రిపేరు, అడ్రస్ మార్చడంతో నకిలీ ఓట్లు చేరుస్తున్నారని పేర్కొన్నారు. ఆధారాలతో సహా అన్ని అంశాలూ ఇసికి అందించామని, బాబు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్డు పేరుతో ఓటర్ల డేటా టిడిపి సేకరిస్తుందని అన్నారు. తెలంగాణలో ఎన్నికలైన తరువాత ఓటర్లు ఎపిలో ఓటు నమోదు చేసుకునేలా టిడిపి డ్రైవ్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

మరోవైపు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టిడిపి ఎంపిలు కనకమేడల రవీంద్ర కుమార్, గల్లా జయదేవ్, కె రామ్మోహన్‌నాయుడు కలిశారు. ఈ సందర్భంగా ఎపిలో నకిలీ ఓట్ల నమోదు, టిడిపి సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై ఇసికి టిడిపి ఎంపిలు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలపై ఫిర్యాదు చేశామన్నారు. ఎపిలో ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను తప్పుదోవ పట్టించిందో చెప్పామన్నారు. దొంగే దొంగ అన్నట్టు వైసిపి నేతల తీరు ఉందన్నారు. యంత్రాగాన్ని, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. 10 లక్షల ఓటర్లు ఫిర్యాదు చేశారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరామని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు 22న ఎపిలో పర్యటిస్తామని చెప్పారన్నారు. చర్యలు తీసుకుంటామని ఇసి అధికారులు హామీ ఇచ్చారన్నారు.నకిలీ ఓట్ల నమోదు, ఓట్ల తొలగింపుపై బిజెపి కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ఎంపి సిఎం రమేష్, బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్.. ఇసిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. కొంతకాలంగా ఎపిలో ఓటర్ లిస్ట్ టాంపరింగ్ జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో సిఇసిని కలిశామన్నారు. దొంగ ఓట్లకు సంబంధించిన వాటికి రుజువు ఇచ్చామని, కేంద్ర ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని పురందేశ్వరి ఆరోపించారు.

తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ మూడవ శాసనసభ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సభ ప్రారంభమైన వెంటనే పలువురు సభ్యుల చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసి ప్రమాణం చేయించారు. అనంతరం స్పీకర్ ఎన్నిక ప్రక్రియను మొదలుపెట్టారు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ పేరును ఆయన ప్రకటించారు. సిఎం రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ సభ్యులు కెటిఆర్‌తో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. సిఎం, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఇతర నేతలు ప్రసాద్ కుమార్‌ను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ప్రసాద్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్‌తో పాటు ఎంఐఎం, సిపిఐ ఎమ్మెల్యేలు మద్దతు తెలపడంతో స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం సభను శుక్రవారానికి స్పీకర్ వాయిదా వేశారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ శుక్రవారం ప్రసంగించనున్నారు. స్పీకర్ ఎన్నికకు సహకరించిన పార్టీలకు సిఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. మంత్రిగా ఉన్నప్పుడు గడ్డం ప్రసాద్ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించారని, ఆయనతో కలిసి పని చేసినందుకు గర్విస్తున్నానని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆదేశాలతో ఏకగ్రీవ ఎన్నికకు సహకరించినట్లు మాజీ మంత్రి కెటిఆర్ తెలిపారు. ఎంపిటిసి నుంచి స్పీకర్‌గా ఎదిగిన గడ్డం ప్రసాద్ జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభ పని చేయాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.


అక్రమ కేసు నుండి బయటపడిన సిపిఎం నేతలు బాబూరావు, రమణారావు, శ్రీనివాస్, మూర్తి


సిపిఎం నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ

కరోనా సమయంలో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన సిపిఎం నేతలపై పెట్టిన అక్రమ కేసును గురువారం విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న కార్మికులు,పేదలకు ప్రభుత్వం సహాయం చేయాలని, భోజన ఏర్పాట్లు చేయాలని కోరుతూ విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సిపిఎం నేతలు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పిఎస్ఎన్.మూర్తిపై పోలీసులు 2020 ఆగస్టు 20న అక్రమంగా కేసు నమోదు చేశారు. సెక్షన్ 188, 143, ఆర్/డబ్ల్యు149 ఐపిసి, సెక్షన్ 30 యాక్ట్, 144 సిఆర్‌పిసి, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన తదితర సెక్షన్లు పెట్టారు. విచారణ అనంతరం ఈ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. ఈ కేసులో సిపిఎం నేతల తరపున సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సిపిఎం నేతలు, ప్రజాసంఘాల కార్యకర్తలపై ప్రభుత్వం పెట్టిన అనేక అక్రమ కేసులు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే జగన్ అభ్యర్థుల మార్పు

- తుపాను సాయంలో ప్రభుత్వం విఫలం
- టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి భయంతోనే పార్టీ అభ్యర్థులను మారుస్తున్నారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. 150 మంది అభ్యర్థులను మార్చినా వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రాలేదని చెప్పారు. రానున్న ఎన్నికలు నియంత జగన్‌కు ప్రజల మధ్య జరుగుతున్న యుద్ధమని అభివర్ణించారు. అతనిని ఇంటికి పంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. 175 స్థానాల్లో గెలుస్తానని మొన్నటి వరకు చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఏకంగా 11 మందిని ఒకేసారి మార్చారని వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులను బదిలీ చేయడం ఇక్కడే చూస్తున్నానని అన్నారు. దళితులు, బిసిలనే మారుస్తున్నారని విమర్శించారు. పులివెందులలో జగన్ బిసి అభ్యర్థిని నిలబెట్టి, తను మరోచోట ఎందుకు పోటీ చేయడని ప్రశ్నించారు. దోపిడీదారులైన బాలినేని శ్రీనివాసరెడ్డి, పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డిని ఎందుకు మార్చరని ప్రశ్నించారు. అందరి అభిప్రాయాలు తీసుకుని సరైన అభ్యర్థుల్ని తాను ఎంపిక చేస్తానని, కుప్పంలో కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తానని చెప్పారు. వైసిపి ఎంపిక మొత్తం తాడేపల్లిలో జరుగుతుందని, తమ ఎంపిక ప్రజామోదంతో ఉంటుందని తెలిపారు. మద్యపాన నిషేధం చేశాకే మరలా ఓట్లు అడుగుతానన్న జగన్.. నిషేధించకుండా అడిగే హక్కు ఎక్కడుందని నిలదీశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కరువు వల్ల 26 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదని, తుపాను వల్ల వేసిన పంట 22 లక్షల ఎకరాల్లో మునిగిపోయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జలవనరులశాఖపై శీతకన్ను వేసిందని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు మరోసారి కొట్టుకుపోవడంతో కరువు ప్రాంతంలో నీళు లేవన్నారు. కాలువలు, డ్రెయిన్లను సరిగ్గా నిర్వహించలేకపోయిందని విమర్శించారు. పంట నష్టం పెద్దయెత్తున జరిగినా ఇప్పటి వరకు ప్రాథమిక అంచనా వేయలేదన్నారు. తుపాను నష్టంతోపాటు నాలుగున్నరేళ్లలో రైతులకు ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా కింద చెల్లించిన అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల పోరాటానికి అండగా ఉంటాం

అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న న్యాయమైన పోరాటానికి తాము అండగా ఉంటామని చంద్రబాబు చెప్పారు. ఆందోళనల్ని ఎంత అణచివేయాలంటే అంత ఉధృతమవుతాయే తప్ప తగ్గవన్నారు. ప్రస్తుతం కేసులు పెట్టి భయపెట్టవచ్చని, వాళ్లకూ ఒకరోజు వచ్చినప్పుడు ఏం చేయాలో చేస్తారని చెప్పారు. తమ ప్రభుత్వం రాగానే వారికి చేయాల్సిన న్యాయం చేస్తామన్నారు.

దొంగ ఓట్లపై సిఇఒకు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ఇష్టారాజ్యంగా దొంగ ఓట్లను చేర్పిస్తోందని, ఓటర్ల జాబితాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) ముఖేష్‌కుమార్ మీనాను వైసిపి తరపున మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్ కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, అయితే టిడిపి నాయకులు పెద్దయెత్తున డబుల్ ఎంట్రీలతో దొంగ ఓట్లను చేర్పిస్తున్నారని ఆరోపించారు. టిడిపి నేతలు అక్రమ మార్గంలో గెలిచేందుకే ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో వున్నవారికి ఇక్కడ 4,30,264 మందికి అక్రమంగా ఓటు హక్కును ఇచ్చారని వాటన్నిటినీ తొలగించాలని కోరారు.

టిడిపిలో చేరిన మాజీ మంత్రి మరడాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి మరడాని రంగారావు టిడిపిలో చేరారు. ఆయనతోపాటు ఏలూరుకు చెందిన పలువురు నేతలు, అదేవిధంగా కదిరి నియోజకవర్గానికి చెందిన పలు కుటుంబాలు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కందికుంట వెంకటప్రసాద్, బడేటి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, గన్ని వీరాంజనేయులు, వలవల బాబ్జి, రవి మందలపు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టిడిపి నాయకులు వల్లూరు కిరణ్ రూపొందించిన 'గెలుపు మనదే డైరీ'ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్దన్, నాయకులు దారపనేని నరేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఐఆర్ఆర్ కేసులో విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం ఒక్క ఎకరం కూడా సేకరించలేదని చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదించారు. భూమి ఎకరం సేకరించినట్లుగా ఒక్క ఆధరారమైనా చూపాలన్నారు. రాజధాని నిర్మాణమే మధ్యలో ఆగిపోయిందని, ఇక ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రస్తావనే ఉండదన్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌తోపాటు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులు చేయడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని వైసిపి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి కేసు నమోదు చేసింది. ఐపిసిలోని వివిధ సెక్షన్లతో తనను నిందితుడిగా చేర్చుతూ సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలని, ఈలోగా బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

రుషికొండ తవ్వకాలపై పిల్ విచారణ ముగింపు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలోని రుషికొండ అక్రమ తవ్వకాలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయంటూ జనసేన పార్టీ కార్పొరేటర్ మూర్తి యాదవ్ దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు పరిష్కరించింది. వ్యర్థాలను సముద్ర తీరంలో వేయడంపై పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. వీటికి చెందిన ఆధారాలను హైకోర్టు నియమించిన నిపుణుల కమిటీకి ఇచ్చేందుకు అంగీకరించింది. పిటిషనరు కోర్టుకు నివేదించిన ఆధారాలను కమిటీకి అందజేస్తూ పిల్‌పై విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది.

రాజకీయ లబ్ధి కోసమే రఘురామ పిల్స్

- హైకోర్టులో సిఎస్ కౌంటర్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు రాజకీయ లబ్ధి కోసమే పిల్స్ దాఖలు చేస్తున్నారని హైకోర్టుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదించారు. కావాలనే ప్రభుత్వ పథకాలకు దురుద్దేశాలను ఆపాదిస్తున్నారని కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ఇతరులకు మేలు జరిగేలా ఉన్నాయని, వీటిపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని రఘురామ దాఖలు చేసిన పిల్‌కు విచారణార్హత లేదన్నారు. దీనిపై రఘురామ వాదనలతో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశించింది. విచారణను జనవరి 23కు వాయిదా వేసింది. సిఎం జగన్ తరపున వకాలత్ దాఖలు చేస్తున్నట్లు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ చెప్పారు. ఇతర ప్రతివాదుల తరపున న్యాయవాదులు కూడా చెప్పారు. నోటీసులు అందని వారికి ఇ-మెయిల్ ద్వారా పంపాలని రఘురామ తరపున న్యాయవాది కోరారు. ఇందుకు ప్రత్యేక అనుమతి అవసరం లేదని హైకోర్టు చెప్పింది.

వైసిపి బిసి సెల్ అధ్యక్షులుగా జంగా కృష్ణమూర్తి

- రైతు విభాగానికి ఎంవిఎస్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అనుబంధ విభాగాలకు నూతన కార్యవర్గాల నియామకం జరిగింది. బిసి, క్రిస్టియన్ మైనారిటీ, ముస్లిం మైనారిటీలతో పాటు రైతు విభాగానికి కమిటీలను ఎంపిక చేశారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా జంగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా డోలా జగన్, కాండ్రు కమల, బి హరిప్రసాద్లతో పాటు మరో 39 మందితో కార్యవర్గం ఏర్పాటు చేశారు. క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా ఎం జాన్సన్. ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా వి ఖాదర్ బాషాను ఎంపిక చేశారు. అలాగే రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంవిఎస్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా త్రినాథ్ రెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, వంగల భరత్ కుమార్ రెడ్డిలను నియమించారు. చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా గంజి చిరంజీవిని నియమించారు.

విఆర్ఎల సమస్యలను క్యాబినెట్‌లో చర్చించాలి

- సిఎస్‌కు ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను శుక్రవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో అజెండాగా పెట్టాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కోరింది. ఈ మేరకు ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి అంజి, కె ఉమామహేశ్వరరావులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని కలిసి గురువారంవినతి పత్రం అందజేశారు. అలాగే నాయకులు షేక్ బందగీ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబును కలిసి వినతి పత్రం అందజేశారు.ప్రతిపక్ష నేతగా విఆర్ఎలకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదని వివరించారు. నాలుగున్నర సంవత్సరాలు దాటినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, ఉద్యమాలు, పోరాటాలు చేస్తే అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఉమామహేశ్వరరావు తదితరులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. గురువారం సచివాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి, డిఎంఎ పి కోటేశ్వరరావుతో కార్మిక సంఘాల జాయింట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు బి ముత్యాలరావు, ఎ జాన్‌బాబు, పి శ్రీనివాసరావు రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలను వివరించారు. ముఖ్యమంత్రి హామీలైన సమాన పనికి సమాన వేతనం, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల పర్మినెంట్ అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఈ సందర్భంగా శ్రీలక్ష్మి కార్మిక సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. చెత్త తరలించే డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులు, మలేరియా, పార్కుల్లో పనిచేసే కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని అన్నారు. డిసెంబరు 15న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో తాము లేవనెత్తిన సమస్యలపై చర్చించాలని, స్పష్టమైన హామీలు రాకపోతే 21 తర్వాత సమ్మెలోకి వెళ్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలని కోరుతూ.. 20, 21 తేదీల్లో సచివాలయాల ముందు ధర్నా

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరువు, వరదలతో నష్టపోయిన రైతు, కౌలు, వృత్తిదారులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని ఈ నెల 20, 21 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఒకటిన్నర దశాబ్దాల కాలంలో ఏనాడూ లేనంతగా తీవ్రమైన కరువు ఏర్పడిందన్నారు. సుమారు 400కు పైగా మండలాల్లో కరువు ఏర్పడితే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాలను మాత్రమే కంటి తడుపుగా ప్రకటించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికొదిశాయన్నారు. ఒకపక్క వ్యవసాయ రంగం దెబ్బతిని మరోపక్క ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులు లేక సుమారు 25 లక్షల మంది వ్యవసాయ కార్మికులు, పేద రైతులు వలసలు పోయారన్నారు. 20, 21 తేదీల్లో నిర్వహించబోయే ధర్నాలను విజయవంతం చేయాలని రైతులను కోరారు.

ఇంటర్ టైం టేబుల్

మొదటి సంవత్సరం		ద్వితీయ సంవత్సరం	
తేది	సబ్జెక్ట్	తేది	సబ్జెక్ట్
1-03-2024 (శుక్రవారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1	02-03-2024 (శనివారం)	సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2
4-03-2024 (సోమవారం)	ఇంగ్లీష్ పేపర్-1	05-03-2024 (మంగళవారం)	ఇంగ్లీష్ పేపర్-2
06-03-2024 (బుధవారం)	మేథమెటిక్స్ పేపర్-1ఎ బోటనీ పేపర్-1 సివిక్స్ పేపర్-1	07-03-2024 (గురువారం)	మేథమెటిక్స్ పేపర్-2ఎ బోటనీ పేపర్-2 సివిక్స్ పేపర్-2
9-03-2024 (శనివారం)	మేథమెటిక్స్ పేపర్-1బి జువాలజీ పేపర్-1 హిస్టరీ పేపర్-1	11-03-2024 (సోమవారం)	మేథమెటిక్స్ పేపర్-2బి జువాలజీపేపర్-2 హిస్టరీ పేపర్-2
12-03-2024 (మంగళవారం)	ఫిజిక్స్ పేపర్-1 ఎకనామిక్స్ పేపర్-1	13-03-2024 (బుధవారం)	ఫిజిక్స్ పేపర్-2 ఎకనామిక్స్ పేపర్-2
14-03-2024 (గురువారం)	కెమిస్ట్రీ పేపర్-1 కామర్స్ పేపర్-1 సోసియాలజీ పేపర్-1 ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1	15-03-2024 (శుక్రవారం)	కెమిస్ట్రీ పేపర్-2 కామర్స్ పేపర్-2 సోసియాలజీ పేపర్-2 ఫైన్‌ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
16-03-2024 (శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ పేపర్-1 లాజిక్ పేపర్-1 బ్రిడ్జ్ కోర్సు మేథ్స్ పేపర్-1	18-03-2024 (సోమవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ పేపర్-2 లాజిక్ పేపర్-2 బ్రిడ్జ్ కోర్సు మాథ్స్ పేపర్-2
19-03-2024 (సోమవారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1 జియోగ్రఫీ పేపర్-1	20-03-2024 (శనివారం)	మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2 జియోగ్రఫీ పేపర్-2

పదో తరగతి షెడ్యూల్

తేది	సబ్జెక్ట్	తేది	సబ్జెక్ట్
18-03-2024 (సోమవారం)	మొదటి భాష (పేపర్-1)	27-03-2024 (బుధవారం)	సోషల్ స్టడీస్
19-03-2024 (మంగళవారం)	రెండవ భాష	28-03-2024 (గురువారం)	ప్రథమ భాష పేపర్-2 (కంపొజిట్‌కోర్సు) ఒఎస్ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్-1
20-03-2024 (బుధవారం)	ఇంగ్లీష్		
22-03-2024 (శుక్రవారం)	మేథమెటిక్స్	30-03-2024 (శనివారం)	ఒఎస్ఎస్‌సి మెయిన్ ల్యాంగ్వేజ్-2 ఎస్ఎస్‌సి వొకేషనల్ కోర్సు
23-03-2024 (శనివారం)	ఫిజికల్ సైన్స్		
26-03-2024 (మంగళవారం)	బయోలాజికల్ సైన్స్		

సందిగ్ధంలో బీమా!

(మొదటిపేజీ తరువాయి)

రైతులే చేరారు. వాతావరణ బీమాలో అది కూడా లేదు. రాష్ట్రం తన వాటా ప్రీమియాన్ని చెల్లించనందునే కేంద్రం నుంచి ఆమోదం లభించలేదని తెలుస్తోంది. గడువు మీరితే పెనాల్టీ చెల్లించాలి. రాష్ట్ర సర్కారు బీమా అమలుకు టెండర్లు పిలిచి కంపెనీలను ఎంపిక చేసి, ఎందుకు ప్రీమియం చెల్లించలేదో స్పష్టత లేదు.కరువు, తుపాన్ బాధిత రైతులను ఆదుకుంటామని మాత్రం ప్రభుత్వం చెబుతోంది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం రబీ బీమా నడుస్తోంది. ఇక్కడా రబీ మొదలైంది.

గుండెపోటుతో దిశ డిఎస్‌పి మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్


వెంకట నాగ ప్రసాద్ (ఫైల్)

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో దిశ డిఎస్‌పి గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజమండ్రికి చెందిన కుడిపూడి వెంకట నాగప్రసాద్ (60) ఈ ఏడాది మార్చిలో పుట్టపర్తి దిశ డిఎస్‌పిగా బదిలీపై వచ్చారు. పుట్టపర్తిలోని ఓ ప్రయివేటు అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకొని ఒక్కరే ఉంటున్నారు. గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని పక్క ఫ్లాట్ వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌పి మాధవరెడ్డి, అడిషనల్ ఎస్‌పి విష్ణు, పుట్టపర్తి డిఎస్‌పి వాసుదేవన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నాగప్రసాద్ మృతి విషయాన్ని రాజమండ్రిలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియజేశారు. నాగప్రసాద్‌కు భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)


అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గామాలపాడు గ్రామానికి చెందిన సంకురాత్రి వెంకటకోటయ్య (42) ఏడు ఎకరాలను కౌలుకు తీసుకుని మూడెకరాల్లో పత్తి, నాలుగెకరాల్లో మిర్చి సాగు చేశారు. గతేడాది పైరుకు నీరందక నష్టపోయారు. ఈ ఏడాది వర్షాభావంతో పైర్లు సరిగా ఎదగలేదు. దీనికితోడు మిచౌంగ్ తుపానుతో మిర్చి పంట బాగా దెబ్బతింది. వ్యవసాయం కోసం సుమారు రూ.10 లక్షలు వరకు అప్పులు చేశారు. పంటలు దెబ్బతినడంతో అప్పులు తీర్చే మార్గం తెలియక బుధవారం రాత్రి తాను సాగు చేస్తున్న పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. రాత్రయినా కోటయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబికులు ఆయన కోసం వెదుకుతూ పొలానికి వెళ్లగా అక్కడ మృతి చెంది పడి ఉన్నాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అనర్హుల చేతుల్లో పాస్ పుస్తకాలు!

- బ్యాంకుల్లో కోట్లాది రూపాయల రుణాలు
- భూముల రీసర్వేతో వెలుగులోకి..
- అనంతపురం, కడప, చిత్తూరు, విశాఖలో అత్యధికం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీసర్వేతోపాటు అధికారుల క్షేత్రస్థాయి పర్యటనల నేపథ్యంలో జరిపిన సమీక్షలతో అనర్హుల చేతుల్లోని పాస్ పుస్తకాల గుట్టు వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వ్యక్తులు పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది ప్రభుత్వపరంగా సబ్సిడీలు, రాయితీలు, బ్యాంకుల్లో రుణాలు లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. వేలాది పాస్ పుస్తకాలు అనర్హుల చేతుల్లో ఉన్నట్లు తెలుసుకున్న అధికారులు ఏమి చేయాలో తోచక తలలు పట్టుకు కూర్చున్నారు. అనంతపురంలో 70 వేలు, కడపలో లక్షకు పైగా సత్యసాయి, చిత్తూరు, విశాఖపట్నంలో వాటి తర్వాత స్థానాల్లో నిలవగా మిగిలిన జిల్లాల్లో కూడా అనర్హుల చేతుల్లో నకిలీ పాస్ పుస్తకాలు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం చేసిన తప్పులకు అసలైన భూ యజమానులు ఇప్పటి వరకు యాజమాన్య హక్కులు పొందలేని పరిస్థితి ఏర్పడింది. భూముల రీ సర్వేతో గ్రామీణ ప్రాంతాల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అవినీతి అధికారుల దెబ్బకు సెంటు భూమి లేనివారికి కూడా ఎకరాల్లో స్థలాలు ఉన్నట్లు పాస్ పుస్తకాలు వచ్చాయి. దీంతో గ్రామాల్లో ఘర్షణలు, తగాదాలు, కోర్టులను ఆశ్రయించేవారు అధికమైనట్లు ప్రభుత్వం గుర్తించింది. భూ యజమానులు కాని వ్యక్తులకు పాస్ పుస్తకాలు ఇచ్చిన వారిని గుర్తించి వారికి నోటీసులిచ్చి తప్పులను సవరించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. అనర్హుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగించాలని సూచించింది. అయితే అది ఆచరణలో సాధ్యమవుతుందా? లేదా? అనే అంశం రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



పాస్ పుస్తకాలతో పెద్దయెత్తున బ్యాంకు రుణాలు

క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందిని మేనేజ్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందినవారు పెద్దయెత్తున బ్యాంకుల్లో క్రాప్ రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు దశాబ్దాలుగా లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా ఆయా భూములను అమ్మడం, తనఖా పెట్టడం జరిగింది. ప్రభుత్వ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం భూ యజమానులు బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడంతో అటువంటి వారి భూములను సొంతం చేసుకున్నారు. అధికారులను మేనేజ్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందడంతోపాటు వెబ్ ల్యాండ్‌లో పేరు నమోదు చేయించుకున్నారు. రీ సర్వేలో భూ భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

ఎన్నికల ఏడాదిలో సాహసం చేస్తారా?

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు కేవలం మూడు, నాలుగు నెలల సమయం మాత్రమే ఉండటంతో ఈ సమయంలో భూములు సాగు చేసుకుంటూ పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వ్యక్తుల పట్టాలు రద్దు చేసి అసలైన భూ యజమానుల పేర్లు వెబ్‌ల్యాండ్ నమోదు ప్రక్రియ వేగవంతం చేసేందుకు ముందుకు వెళతారా! లేక కలెక్టర్లకు ఉత్తర్వులిచ్చి చేతులు దులుపు కుంటారా అనేది తేలాల్సి ఉంది.

ఇండస్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- 47 మంది రోగులు క్షేమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



అగ్ని ప్రమాదం జరిగిన ఇండస్ ఆసుపత్రి ఇదే..

విశాఖ జగదాంబ జంక్షన్ సమీపంలో కెజిహెచ్ డౌన్‌లో ఉన్న ఇండస్ ఆస్పత్రిలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. రెండో అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో నైట్రస్ ఆక్సైడ్ లీకేజీ కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందడంతో హుటాహుటిన వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 47 మంది రోగులను ఫైర్ సిబ్బంది రక్షించారు. వీరిలో ఐదుగురు ఐసిఇలో చికిత్స పొందుతున్న వారు ఉన్నారు. 22 మందిని సమీపంలోని మెడికవర్ ఆసుపత్రికి, ఇద్దరిని కెజిహెచ్‌కు, మిగిలిన వారిని విజేత ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం జరగక ముందు నుంచీ పరిస్థితి విషమంగా ఉన్న కృష్ణమనాయుడు మెడికవర్ ఆసుపత్రిలో చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించాల్సి ఉంది. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ఆసుపత్రి యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. సిఎం ఆదేశాల మేరకు అగ్నిప్రమాదంపై విచారణ జరిపి 24 గంటలలోగా నివేదిక ఇవ్వాలని ఐదుగురితో కూడిన కమిటీని విశాఖ కలెక్టర్ మల్లికార్జున వేశారు. ప్రమాద ఘటనపై ఇండస్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో తాను ఆపరేషన్ థియేటర్లో ఉన్నానని, దట్టమైన పొగరావడంతో ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చామని తెలిపారు. ఆపరేషన్ థియేటంలో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉండవన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

అగ్నిప్రమాదంపై సిపిఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్న రోగులు పొగ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు.

వైసిపి, టిడిపిది వ్యక్తిగత స్వార్థం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి, టిడిపి వ్యక్తిగత స్వార్థం కోసం రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టాయని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు సంజయ్‌గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిసిసి ఆధ్వర్యాన రెండు రోజులుగా విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరుగుతున్న వరుస సమావేశాలకు సంబంధించి పలు అంశాలను రుద్రరాజు గురువారం మీడియాకు వివరించారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు తరువాత ఎపిలో కాంగ్రెస్ అధికారం చేపడితే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన సమావేశం ఉంటుందని రుద్రరాజు తెలిపారు. వైసిపి ఎమ్మెల్యేలతోపాటు వివిధ పార్టీల నేతలు తమకు టచ్‌లో ఉన్నారని అన్నారు. సోషల్ మీడియా విభాగం, కాంగ్రెస్ పార్టీ ఫేస్‌బుక్ పేజీ, ఇన్‌స్టా, ఎక్స్ సామాజిక మాధ్యమాల అధికారిక పేజీలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లు ప్రారంభించారు.


అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం లైన్ కొత్తూరు వద్ద అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు తెలిపిన లోకేష్

తాళాలు బద్దలుగొట్టే అధికారం ఎవరిచ్చారు?

- అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు
- పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, యలమంచిలి రూరల్ విలేకరి

ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను వేధించడం దారుణమని, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు బద్దలుగొట్టే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రశ్నించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం కొత్తూరు నుంచి ప్రారంభమై రాంబిల్లి మండలంలోని పంచదార్ల వరకు సాగింది. యలమంచిలి మండలం లైన్ కొత్తూరు సమీపంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలపై వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, యూనియన్లతో చర్చించి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. యలమంచిలిలో విశ్రాంత ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా ఒకటిన పెన్షన్ చెల్లిస్తామని తెలిపారు. హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులను జగన్ ప్రభుత్వం వేధించడం తగదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అప్పు రూ.12 లక్షల కోట్లకు చేరడంతో ఏడాదికి లక్ష కోట్లు వడ్డీ చెల్లించే పరిస్థితి వచ్చిందన్నారు. తాము అధికారంలోకి వస్తే పిఆర్‌సి వేసి మెరుగైన ఫిట్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. జిఒ 79ని రద్దు చేస్తామని, ఉద్యోగులకు హౌసింగ్ స్కీం, నాణ్యమైన ఇళ్లుఇస్తామని, మెడికల్ బిల్లులు రీయింబర్స్‌మెంట్ చేస్తామని వెల్లడించారు. గవర సామాజిక తరగతి ప్రతినిధులతో లోకేష్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నిలిపివేసిన విదేశీ విద్య, పిజి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను తిరిగి ప్రారంభిస్తామని, ఐటిఐలు ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పిస్తామని, గవర కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు

రైల్వే స్టేషన్‌లో వాటర్ ట్యాంక్ కూలి ముగ్గురు మృతి

- 30 మందికి పైగా గాయాలు
- పశ్చిమబెంగాల్‌లోని బర్ద్వాన్‌లో ఘటన

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని బర్ద్వాన్ రైల్వే స్టేషన్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. 133 ఏళ్ల నాటి ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ రైల్వే స్టేషన్‌లోని 2, 3 ప్లాట్‌ఫారమ్‌ల మధ్య కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనతో 1 నుంచి 4 ప్లాట్‌ఫారమ్‌ల మధ్య గంటపాటు రైలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాద ఘటనపై విచారణ చేసేందుకు రైల్వే అధికారులు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

అప్పులు చేసి పంటలు సాగుచేశాం

- వర్షాల్లేక పంటలన్నీ ఎండిపోయాయి
- ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి- యంత్రాంగం


ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండలం లక్ష్మీపురంలో ఎండిపోయిన పత్తి మొక్కను కేంద్ర బృందానికి చూపుతున్న రైతు మోషే

'అప్పులు చేసి పంటలు సాగుచేసినా కన్నీరే మిగిలింది. వ్యయప్రయాసలకోర్చి సాగు చేసినా వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోయాయి. తీవ్రంగా నష్టపోయాం.. తమను ఆదుకోండి' అంటూ కేంద్ర బృందం ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులను అధ్యయనం చేయడానికి కేంద్ర బృందాలు గురువారం చిత్తూరు, నంద్యాల, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పర్యటించాయి.

కృష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ పి.దేవేంద్రరావు నేతృత్వంలో కేంద్ర బృందం సభ్యులు డిపార్‌టమెంట్ ఆఫ్ అనిమల్ హస్బెండరీ, డైరీయింగ్ అంజు బసెరా, ఎంఎన్‌సిఎఫ్‌సి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగరాజపురం గ్రామాల్లో వేరుశెనగ పంట పొలాల్లో కేంద్ర బృందం పర్యటించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎకరా వేరుశెనగ పంటకు దాదాపు రూ.35 వేలు ఖర్చవుతోందని, పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నామని, ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలని రైతులు కేంద్ర బృందం ఎదుట వాపోయారు. పలమనేరు, రామకుప్పం మండలాలలో నీటిలభ్యత తక్కువగా ఉందని, శాశ్వత నీటివసతి లేదని కేంద్ర బందానికి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు వివరించారు. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అందిన అభ్యర్థనలను ఉన్నతాధికారులకు నివేదిక పంపి పరిష్కరించేందుకు కషి చేస్తామని పి.దేవేంద్రరావు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలో ఇంటర్ మినిస్ట్రీయల్ సెంట్రల్ టీమ్ లీడర్ పంకజ్ యాదవ్ నేతృత్వంలోని కేంద్ర బంద సభ్యులు పొన్నుస్వామి, అనురాగ దీక్షిత్ పర్యటించారు. తిరువూరు మండలంలో ఎండిపోయిన వరి, పత్తి పంటలను పరిశీలించారు. లక్ష్మీపురం దళితపేటలో తుంపుర మోషే సాగుచేసిన పత్తి పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్‌రంగాపురంలో కేంద్ర కరువు బృందం సభ్యులు, నీతి ఆయోగ్ సీనియర్ రీసర్చ్ ఆఫీసర్ డాక్టర్ అనురాధ, జలశక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుధ్య విభాగం అసిస్టెంట్ అడ్వైజర్ సంతోష్, డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రెటరీ సంగీత్ కుమార్ పర్యటించారు. దెబ్బతిన్న కంది పంటను పరిశీలించారు. బేతంచేర్ల, పగిడ్యాల, మిడుతూరు మండలాల కరువు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎర్ర చందనం రక్షణకు నిధుల కొరత

- టాస్క్‌ఫోర్స్‌కు టిఎ, డిఎలు లేవు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎర్రచందనం నరికివేతను అడ్డుకునేందుకు పోలీస్, అటవీ శాఖల అధ్వర్యంలో సాగుతున్న కార్యక్రమాలకు నిధుల లేమి వేధిస్తోంది. స్మగ్లర్లను అడ్డుకునేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు కనీసం టిఎ, డిఎ కూడా ఇవ్వడం లేదని సమాచారం. దీనిపై అటవీశాఖ, పోలీసు శాఖల నుంచి వరుసగా విజ్ఞప్తులు వస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. పలు జిల్లాల్లో విస్తరించి ఉన్న శేషాచలం అడవుల్లో ఏళ్ల తరబడి ఎర్రచంద్రనం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. ఆంధ్రా, తమిళనాడుకు చెందిన స్మగ్లరు ఎర్రచందనం చెట్లను నరికివేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు 2014లో యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను సాయుధ బలగాలతో ఏర్పాటుచేశారు. ఎపిఎస్‌పి నుంచి 92 మందితో, పోలీసు శాఖ నుంచి 85 మందితో, జిల్లాకు చెందిన ప్రత్యేక బలగాలు, అటవీ సిబ్బంది వంటి వారితో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. ఈ సిబ్బందికి కొంత కాలంగా కనీసం టిఎ, డిఎలు కూడా రావడం లేదని సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరంలోనే మూడున్నర కోట్లకు పైగా నిధులు రావాల్సి ఉందని అటవీ శాఖ నుంచి ప్రభుత్వానికి లేఖ వచ్చింది. అడ్వాన్స్ బిల్లులు కోటి రూపాయలకుపైగానే రావాల్సి ఉందని అంటున్నారు. రవాణా భత్యం కూడా మరో కోటి రూపాయలకుపైగానే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే స్టేషనరీ, సర్వీస్ పోస్టేజి, మరమ్మతులు, పాలనా వ్యయం, జిపిఎఫ్, వంటివి కూడా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇలా భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల సిబ్బందిలో నైరాశ్యం పెరిగిపోతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వం కోల్పోయాం..

- కేంద్ర బృందానికి రైతుల మొర

ప్రజాశక్తి-యంత్రాంగం

నెల్లూరు జిల్లా పల్లిపాడులో దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతకొచ్చే సమయంలో తుపాను వల్ల కురిసిన వర్షానికి నేలపాలైంది. అప్పులు చేసి సాగుచేశాం. సర్వం కోల్పోయాం ఆదుకోవాలని కేంద్ర బృందానికి రైతులు మొరపెట్టుకున్నారు. మిచౌంగ్ తుపాను ప్రాంతాలైన నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కేంద్రం బృందం గురువారం పర్యటించింది. నెల్లూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కేంద్ర బృందం సభ్యులు, కేంద్ర ప్రకృతి విపత్తుల సంస్థ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, విక్రంసింగ్ పర్యటించారు. ఇనమడుగు, లేగుంటపాడు, చెర్లోపాలెం, పల్లిపాడు, జగదేవి పేట, కొత్తూరు ప్రాంతాల్లో వర్షాలకు దెబ్బతిన్న తమలపాకు, అరటి తోటలను పరిశీలించారు. రైతులు సురేంద్ర రెడ్డి, ఆసిం, శ్రీనివాసులు రెడ్డితో మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించారు. జగదేవిపేటలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించి జరిగిన నష్టాన్ని, తీసుకున్న చర్యలను విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంకటాచలం మండలం, పులితీగల పాడు వద్ద కనుపూరు కాలువకు పడిన గండిని కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు.

తిరుపతి జిల్లా తడ మండలంలోని కాదలూరు, కోండూరు గ్రామాల్లో కేంద్ర కరువు బృందం సభ్యులు మీనాహుడా, రాజేష్ కుమార్ పర్యటించారు. కాదలూరు చెరువుకు పడిన గండిని, పులివేంద్ర గ్రామం వద్ద ఇసుక మేటలను పరిశీలించారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, విద్యుత్ మౌలిక సదుపాయాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కిలివేటి సంజీవయ్య పాల్గొని విపత్తుల వల్ల కలిగిన నష్టాన్ని అవగాహన చేసుకుని నివేదిక అందజేయాలని, ఎక్కువ నిధులు వచ్చేలా చూడాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.

అమ్మకానికి అనిల్ అంబానీ ఆస్తులు

- ఎన్‌సిఎల్‌టి గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు చెందిన పలు రియల్ ఎస్టేట్ ఆస్తులను విక్రయించేందుకు ముంబై ఎన్‌సిఎల్‌టి ట్రిబ్యునల్ ఆమోదం తెలిపింది. ఆర్‌కామ్ పలు రుణదాతల నుంచి భారీగా అప్పులు తీసుకుని చెల్లించడంలో విఫలం అయ్యింది. దాంతో ఆ సంస్థ దివాళా పిటిషన్ దాఖలు చేయడంతో ఎన్‌సిఎల్‌టి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌కామ్‌కి చెందిన రిజల్యూషన్ ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన కొన్ని అపరిమిత ఆస్తుల విక్రయాన్ని చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ ట్రిబ్యునల్ ఆమోదం కోసం రిజల్యూషన్ ప్లాన్‌ను సమర్పించిన తర్వాత సిఐఆర్‌ఎఫ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 29 ప్రకారం దరఖాస్తుదారు కార్పొరేట్ రుణగ్రహీత ఆస్తులను విక్రయించవచ్చని ఈ ట్రిబ్యునల్ స్పష్టం చేస్తుంది.

వాస్తవానికి 2016లో ముఖేష్ అంబానీ రిలయన్స్ జియో ప్రారంభించిన తర్వాత టెలికం రంగంలో తీవ్ర పోటీతత్వం పెరిగి అనిల్ అంబానీ సంస్థ పరిస్థితి చాలా దిగజారింది. ఆర్‌కామ్ భారీ నష్టాల్లోకి జారుకుంది. ఆ తర్వాత తన బ్యాంక్ రుణాలను చెల్లించటంలో విఫలం అయి చివరికి దివాలా ప్రక్రియలోకి వెళ్లిపోయింది. ఆర్‌కామ్ చెన్నయ్ హెడ్ ఆఫీసు, అంబత్తూర్‌లో సుమారు 3.44 ఎకరాల స్థలం, పూణెలోని 871.1 చదరపు మీటర్ల స్థలం, భూవనేశ్వర్‌లోని బేస్డ్ ఆఫీసు స్పేస్, క్యాంపియన్ ప్రాపర్టీస్ షేర్లలో పెట్టుబడి, రిలయన్స్ రియాల్టీ షేర్లలో పెట్టుబడులను విక్రయానికి ఎన్‌సిఎల్‌టి ఆమోదం తెలిపింది.

సూచీలకు ఫెడ్ జోష్..

- సెన్సెక్స్ 930 పాయింట్లు ర్యాలీ
- నూతన గరిష్టాలకు మార్కెట్లు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన గరిష్ట స్థాయిలకు ఎగిశాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగించడంతో పాటు భవిష్యత్‌లో రేట్ల తగ్గింపు ఉంటుందని సంకేతాలు ఇవ్వడంతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ లాభాలతో నూతన రికార్డులకు చేరాయి. ముఖ్యంగా ఐటి, రియల్టీ షేర్ల పరుగులతో బిఎస్ఇ సెన్సెక్స్ 930 పాయింట్లు లేదా 1.34 శాతం ఎగిసి 70,514కు చేరింది. అదే బాటలో ఎన్ఎస్ఇ నిఫ్టీ 256 పాయింట్లు లేదా 1.26 శాతం రాణించి 21,183 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సిఎల్ టెక్, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎంఅండ్ఎం, టిసిఎస్ తదితర సూచీలు అధికంగా 4 శాతం మేర లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1 శాతం, 0.6 శాతం పెరిగాయి. ఒక్కపూటలోనే మదుపరుల సంపద దాదాపు రూ.4లక్షల కోట్లు పెరిగి.. బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.355 లక్షల కోట్లకు చేరింది. ఆసియా మార్కెట్లలో షాంఘై, నిక్కీ మినహా మిగిలిన అన్ని మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో సాగాయి. ద్రవ్యోల్బణం కట్టడికి రేట్లు పెంచుతూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజాగా తన కీలక రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. రెండు రోజుల పాటు జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసి) భేటీలో ద్రవ్యోల్బణం ఇంకా 2 శాతం లక్ష్యం కంటే ఎగువనే ఉన్నందున కఠిన వైఖరిని కొనసాగించాలని నిర్ణయించుకుంది. విధాన రేట్లను ప్రస్తుత 5.25-5.50 శాతం శ్రేణిలోనే ఉంచుతున్నట్లు స్పష్టం చేసింది. వరుసగా మూడో సారీ రేట్లను ఇదే స్థాయిలో కొనసాగించింది. కాగా.. 2024లో మూడు విడతల్లో వడ్డీ రేట్లలో కోత ఉండొచ్చన్న సంకేతాలు ఇవ్వడంతో ప్రపంచ మార్కెట్లలో ఉత్సాహం నెలకొంది.



కేర్ హెల్త్‌తో ఇఎస్‌ఎఫ్‌బి జట్టు

న్యూఢిల్లీ : చిన్న ఫైనాన్స్ బ్యాంక్‌లలో ఒకటైన ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఇఎస్‌ఎఫ్‌బి), దేశంలోని ప్రముఖ స్పెషలైజ్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలలో ఒకటైన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంలో ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కంట్రీ హెడ్ మురళీ వైద్యనాథన్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ అండ్ రిస్క్ హెడ్ చౌదరి చంద్రకాంత మిశ్రా పాల్గొన్నారని తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు వినూత్నమైన ఆరోగ్య బీమా పరిష్కారాలను అందించనున్నట్లు పేర్కొంది.

బిగ్ సి వార్షికోత్సవ వినూత్న ఆఫర్లు

హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ మొబైల్ చైన్ బిగ్ సి తన 21 వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. ఇది వరకు ఎప్పుడూ కనీవినీ ఎరుగని సంచలన ఆఫర్లను అందిస్తున్నామని బిగ్ సి ఫౌండర్, సిఎండి ఎం బాలు చౌదరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ పండుగను ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆకర్షణీయ డిస్కౌంట్లను అందించడం తమ సంస్థ అనవాయితీ అని వెల్లడించారు.

ఈ వార్షికోత్సవం సందర్భంగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.1,10,000 విలువ గల హెల్త్‌కేర్ ప్రయోజనాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్‌లో ఒక ఏడాది పాటు అపరిమిత టెలి ఫోనిక్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రమాద బీమా, మందులపై 20 శాతం వరకు రాయితీ, రూ.5,000 వరకు అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా రూ.21కే రూ.4,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్‌వాచ్ లేదా రూ.2999 విలువగల రెడ్మీ బడ్స్ ఆఫర్‌ను అందిస్తున్నామన్నారు. ప్రతీ మొబైల్, స్మార్ట్ టివి, ల్యాప్‌టాప్ కొనుగోలుపై ఒక కచ్చితమైన బహుమతి అందిస్తున్నామన్నారు. బ్రాండెడ్ పరికరాలపై 51 శాతం వరకు రాయితీ పొందవచ్చన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బిగ్ సి అధినేత బాలు, ఇతర ఉన్నతాధికారులు

సంపాదకీయం

పార్లమెంటుకే భద్రత కరువు!

దేశ అత్యున్నత చట్టసభయైన పార్లమెంటు భద్రతకే పెనుముప్పు కలగడం దారుణం. సరిగ్గా 22 ఏళ్ల క్రితం పార్లమెంటుపై ఉగ్రదాడి జరిగిన డిసెంబర్ 13వ తేదీనే లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీ నుండి ఇద్దరు ఆగంతకులు సభలోకి దూకి రంగు పొగను వదలి నానా బీభత్సం సృష్టించడం ఎవ్వరూ ఊహించలేనిది. జాతీయత, దేశ భద్రత గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే బిజెపి పాలనలో పార్లమెంటుకే భద్రత లేదని రుజువైంది. దేశ భవితవ్యానికి సంబంధించిన చట్టాలను, విధానాలను రూపొందించవలసిన పార్లమెంటు సభ్యులు ఆగంతకులను నిర్బంధించడానికి స్వయంగా పూనుకోవలసిరావడం విచారకరం. ఏది ఏమైనా పార్లమెంటు భద్రతా ఏర్పాట్లు చేసే ఢిల్లీ పోలీసు సాక్షాత్తూ కేంద్ర హెూం మంత్రి పర్యవేక్షణలోనే ఉంటుంది కనుక ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే! ప్రపంచంలో అత్యంత భద్రత గల భవనాల్లో భారత కొత్త పార్లమెంటు ఒకటని మన పాలకులు గొప్పలు చెప్పిన చోటనే ఇంతటి భద్రతా వైఫల్యం చోటు చేసుకోవడాన్ని ఏమనుకోవాలి? ఒకవైపు కోవిడ్ మహమ్మారి దేశాన్ని ఆవహించిన సమయంలోనే అతివేగంగా పార్లమెంటు కొత్త భవనాన్ని ఆగమేఘాలపై నిర్మించిన విషయం గమనార్హం.

'ప్రజాస్వామ్య దేవాలయం' అని ప్రస్తుతించి పార్లమెంటు భవన సోపానాలను ముద్దాడిన పెద్దమనిషి పాలనలోనే ఆ చట్టసభకు ఇలాంటి దుస్థితి దాపురించింది. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఉన్నత స్థాయి బృందాన్ని నియమించారు. ఆగంతకులిద్దరూ కర్ణాటకలోని కొడగు నియోజకవర్గ ఎంపి ప్రతాప్ సింహ ద్వారా విజిటర్స్ గ్యాలరీకి పాస్‌లు సంపాదించారన్న ప్రాథమిక సమాచారం అధికార పార్టీ వైపే వేలు చూపిస్తోంది. దుండగుల పూర్వాపరాలు, ఘటనకు ముందు, ఆ తరువాత వారు ఎవరి ఆదేశాలు పాటించారు, ఎవరిని సంప్రదించారు, ఎటువంటి సందేశాలు ఎవరికి పంపారు వంటి అంశాలన్నిటినీ పరిశీలించాలి. త్వరితగతిన అన్ని కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేసి ఇంతటి తీవ్ర భద్రతా వైఫల్యానికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి. ఆగంతకులిద్దరు సభలోకి దూకినా మొత్తం ఆరుగురు నిందితులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని సమాచారం. వారిలో నలుగురిని అరెస్టు చేయగా మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆరుగురు దుండగులు పక్కా ప్రణాళికతో పూర్తి సమన్వయంతో ఈ దుస్సాహసానికి ఒడిగట్టారని పోలీసులు వెల్లడించారు. ఒకరికొకరు ఆరేళ్లుగా తెలుసునని, కొద్ది రోజుల క్రితం పథకం పన్నారని పోలీసులు తెలిపారు. ఆరుగురూ పార్లమెంట్‌లోకి ప్రవేశించాలని అనుకున్నారు. కానీ ఇద్దరికి మాత్రమే విజిటర్స్ పాస్ లభించడంతో లోపలికి వెళ్లారంటున్నారు. సభలోకి దూకిన ఆగంతకులు 'నియంతృత్వం నశించాలి', 'నల్ల చట్టాలు రద్దు చెయ్యాలి', 'గణతంత్రాన్ని కాపాడాలి' అని నినదించారు. "మాకు ఏ సంఘంతోనూ సంబంధం లేదు. ప్రభుత్వం పౌరులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున ఈ చర్యకు పాల్పడ్డాం" అని నిందితులు మీడియాతో అన్నారు. పార్లమెంటుపై ఉగ్ర దాడి జరిగి 22 ఏళ్లు అయిన నేపథ్యంలో బుధవారంనాడు భద్రత ఎంతో కట్టుదిట్టంగా ఉండడం సహజం. అయినా, నాలుగైదు చోట్ల ఒళ్లంతా తడిమి పరీక్షించే పటిష్టమైన భద్రతా వలయాలను దుండగులెలా అధిగమించారన్నది పెద్ద ప్రశ్నగానే ఉంది. ఇందుకు వ్యూహం రూపొందించినవారెవరు? పథకం అమలుకు సహకరించిన వారెవరు? ఎందరు? అసలు వారి లక్ష్యం ఏంటో, ఎందుకిలా చేశారో సంపూర్ణంగా తెలియాలి.

ఇంతటి ఘోర భద్రతా వైఫల్యానికి కారణాలను ప్రాథమికంగానైనా రాజకీయ పార్టీలకు వివరించడం ప్రభుత్వ బాధ్యత. తద్వారా ఈ దేశ ప్రజలకు వాస్తవాలు విదితమవుతాయి. కానీ ఆ పని చేయకుండా పార్లమెంటులో ఇతరేతర అంశాలపై చర్చ సాగించడం ద్వారా భద్రతా వైఫల్యాన్ని చిన్నదిగా చూపించడానికి సర్కారు యత్నిస్తోందని స్పష్టమవుతోంది. దుండగుల ప్రవేశానికి వీలు కల్పించిన కర్ణాటక బిజెపి ఎంపితో సహా బాధ్యులందరిపైనా సమగ్రంగా, వేగంగా దర్యాప్తు చేయాలి. ఈ ఘటన నేపథ్యంలో కొత్త పార్లమెంటు భవనంలో భద్రతాపరమైన అంశాలన్నిటినీ సంపూర్ణంగా సమీక్షించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం అవశ్యం.

మహనీయుల మాట



సోషలిజానికి సార్వజనీన మార్గాలు, సార్వజనీన నమూనాలు అంటూ ఏమీ లేవు. ఆయా దేశాల గడ్డలపై గల నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్ట కాలమానాల్లో సోషలిజం పెరగాలి.

- శ్యామ్ వెబ్,
అమెరికా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు.

గవర్నర్ల నియంతృత్వ పోకడలు

వ్యాఖ్య



మహారాష్ట్రలో వివిధ కేసులు నమోదు చేయడం ద్వారా బిజెపి...అజిత్ పవార్‌ను తమ కాషాయ గూటికి చేర్చింది. కానీ కేరళ, తమిళనాడులో అది కుదరలేదు. అందుకే తమిళనాడు, కేరళలో గవర్నర్ల ద్వారా పాలనాపరమైన సంక్షోభాన్ని సృష్టించే పనిలో పడింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను కేంద్రం నియమించిన గవర్నర్ అడ్డుకుంటున్నారు. రాష్ట్రాల సామాజిక-ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించే విధంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. ఇది ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగిస్తుంది. కేరళలో మూడేళ్లకు పైగా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించలేదు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించలేదు.

మానవ వనరుల అభివృద్ధిలో కేరళ మొదటి స్థానంలో, తమిళనాడు రెండో స్థానంలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బిజెపి ఒంటరిగా శాసనసభకు లేదా పార్లమెంటుకు పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలవదని వారికి, ప్రజలకు బాగా తెలుసు. చాలా ఏళ్లుగా బిజెపి పరిస్థితి ఇదే. ఇది బిజెపి నాయకత్వాన్ని కలవరపెడుతోంది.

కేరళ, తమిళనాడు లోని రెండు ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోంది. అందుకోసం ఎన్ఐఏ, సిబిఐ, ఇ.డి తదితర కేంద్ర ఏజెన్సీలను ఇరు రాష్ట్రాల్లోనూ రప్పించి తమకు ఏమైనా ప్రయోజనం చేకూరుతుందా అని చూస్తున్నారు. అక్కడి నాయకులను అవినీతిపరులుగా ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు.

కేరళలో బంగారం స్మగ్లింగ్ కేసును కేంద్ర ఏజెన్సీలు నెలల తరబడి దర్యాప్తు చేస్తున్నాయి. దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఈ కేసులో ఇరికించలేకపోయారు. చార్జిషీటు దాఖలైన తర్వాత కూడా ముఖ్యమంత్రిని ఎలాగైనా ఇరికించాలనే చూస్తున్నది.



జి. రామకృష్ణన్

తమిళనాడు లోని మంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేసి కేసు నమోదు చేయవచ్చా లేదా అనేదానిపైనే ఇ.డి దృష్టి వుంది. తమిళనాడు, కేరళతో పాటు ఢిల్లీ, పంజాబ్ సహా బిజెపి యేతర రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలను నాశనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏజెన్సీలను ఉపయోగించుకుంటోంది.

మహారాష్ట్రలో వివిధ కేసులు నమోదు చేయడం ద్వారా బిజెపి...అజిత్ పవార్‌ను తమ కాషాయ గూటికి చేర్చింది. కానీ కేరళ, తమిళనాడులో అది కుదరలేదు. అందుకే తమిళనాడు, కేరళలో గవర్నర్ల ద్వారా పాలనాపరమైన సంక్షోభాన్ని సృష్టించే పనిలో పడింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను కేంద్రం నియమించిన గవర్నర్ అడ్డుకుంటున్నారు. రాష్ట్రాల సామాజిక-ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగించే విధంగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. ఇది ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగిస్తుంది.

కేరళలో మూడేళ్లకు పైగా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించలేదు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆమోదించలేదు. గవర్నర్ల నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

శాసనసభ ఆమోదించిన బిల్లులు, చట్టాలపై సంతకం చేయకుండా ఆపరాదని, బిల్లులపై సంతకం చేయకపోవడానికి కారణం ఉంటే దానిపై నోట్ రాసి బిల్లులను వెనక్కి పంపాలని పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌కు సుప్రీంకోర్టు సూచించింది. అదే బిల్లును మళ్లీ అసెంబ్లీ ఆమోదించినట్లయితే, ఆ బిల్లులపై గవర్నర్ సంతకం చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు చెప్పింది.

కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే గవర్నర్లకు ప్రజలచే ఎన్నుకోబడిన శాసనసభ కంటే ఎక్కువ అధికారం లేదని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది. అంతేకాదు, గత మూడేళ్లలో తమిళనాడు గవర్నర్ ఏం చేస్తున్నారని కూడా కోర్టు ప్రశ్నించింది. బిల్లులను ఆమోదించి సంతకాలు ఎందుకు చేయలేదని కోర్టు ప్రశ్నించింది. ఈలోగా ఎలాంటి నోట్లు రాయకుండానే గవర్నర్ బిల్లులను శాసనసభకు తిప్పి పంపారు.

ఆ తర్వాత 2023 నవంబర్ 18న ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులను మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపారు. ఆ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... "జ్వరం, జలుబు కారణంగా కొన్ని రోజులు సెలవులో ఉన్నాను. కానీ నా ఆరోగ్యం కంటే నా రాష్ట్ర ప్రజల మేలు గొప్పది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ శాసనసభ మేలు కంటే మన మాతృభూమి అయిన తమిళనాడు సంక్షేమమే గొప్పది కాబట్టి నేను మీ ముందు నిలబడతాను".

"కోట్ల మంది ప్రజలు మనకు ఇచ్చిన అధికార కేంద్రంగా శాసనాలు చేసే ఈ సభను అడ్డుకునేందుకు ఏ శక్తి ప్రయత్నించినా అది భారత ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అవుతుంది. అందుకే నేను మీ ముందు నిల్చొని ఉన్నాను. శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడమంటే ఆ చట్టసభను అవమానించడమే." అన్నారు.

నవంబర్ 10వ తేదీన ఆర్.ఎన్.రవికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. ఆయన నవంబర్ 13న అన్ని బిల్లులను తిరిగి పంపారు. 18వ తేదీన మరోసారి బిల్లులను శాసనసభ ఆమోదించి గవర్నర్ సమ్మతికి పంపింది. 20న సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు...తిరిగి వచ్చిన బిల్లులను అసెంబ్లీ మళ్లీ ఆమోదించి పంపితే గవర్నర్ సంతకం చేయక తప్పదని కోర్టు పేర్కొంది. కానీ ఆర్.ఎన్.రవి సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోకుండా ఒక్కటి తప్ప మిగతా బిల్లులన్నిటినీ రాష్ట్రపతికి పంపారు.

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపినట్లు తమిళనాడు ప్రభుత్వం డిసెంబర్ 1న సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నిబంధన 200 ప్రకారం గవర్నర్ చర్య తప్పని, అలా చేసే అధికారం గవర్నర్‌కు లేదని కోర్టు బదులిచ్చింది. గవర్నర్ కూడా ముఖ్యమంత్రిని పిలిచి సమస్యను పరిష్కరించాలని ప్రతిపాదించారు. అయితే గవర్నర్‌కు ముఖ్యమంత్రితో ఫోన్ చేసి మాట్లాడేంత సంబంధాలు లేవని గవర్నర్ తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు.

బిజెపి యేతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను, బిజెపి మద్దతుదారులను గవర్నర్లుగా నియమిస్తోంది. రాష్ట్ర పరిపాలనను అనిశ్చితిలో పడవేయడమే గవర్నర్ల కర్తవ్యమని బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు భావిస్తున్నాయి. దీనిప్రకారమే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి రాజ్యాంగ సూత్రాలను గాలికొదిలేసి ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

నవంబర్ 26న తమిళనాడు అంబేద్కర్ న్యాయ విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడారు. 'స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు, అందరూ కలిసి ఒకటిగా నిలిచారు. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలుగా విడిపోయారు. నిపుణుల కమిటీల లోతైన అధ్యయనాల తర్వాత మన రాజ్యాంగం ఆమోదించబడింది. అయినా, ఇది ఇంకా అసంపూర్ణంగానే ఉంది.' అన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాలను, సంకీర్ణ పాలనను ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఆర్.ఎన్.రవి అంగీకరించరని పైన పేర్కొన్న ప్రసంగాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. బిజెపి యేతర రాష్ట్రాల్లో గవర్నర్లు మోడీ, అమిత్ షాల నియంత్రణలో ఉన్నారు. సంకీర్ణ పాలన, లౌకికవాదానికి వ్యతిరేకంగా చోటుచేసుకొంటున్న నియంతృత్వ పోకడలపై పోరాటాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆర్ఎస్ఎస్ గవర్నర్ల చర్యలు మనకు గుర్తు చేస్తున్నాయి.

(వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు)

పోరాటం



ఎన్నాళ్ళీ వెట్టిచాకిరి?

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో శానిటేషన్ కార్మికుల పాత్ర వెలకట్టలేనిది. సమాజంలో అట్టడుగున ఉన్నటువంటి పేద, దళిత, గిరిజన, వర్గాల ప్రజలు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అనేక దశాబ్దాలుగా స్వీపర్లుగా, శానిటేషన్ (ఆయా), కంటింజెంట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ పిల్లల ఆరోగ్యాలను కాపాడుతున్న వీరితో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తున్నది. విద్యార్థులు రాక ముందే వచ్చి స్కూళ్లు, కాలేజీలు శుభ్రం చేసి విద్యాలయాలు మూసే వరకు అక్కడే ఉండాల్సి వస్తున్నది. దాదాపు ఉదయం 7.30 గంటలకు ఇంటి నుండి బయలుదేరితే సాయంత్రం 6-7 గంటలకు తిరిగి ఇంటికి చేరుతున్నారు. స్వీపర్లు, స్కావెంజర్లుగా ఫుల్ టైం పని చేస్తున్న వారికి వైసిపి ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో జీవో నెం.22 తీసుకొచ్చి రూ.6 వేల వేతనం ఇస్తానని చెప్పింది. కానీ అది కూడా ప్రతీ నెలా జీతాలు ఇవ్వడం లేదు. అమ్మ ఒడి పథకం నుండి ప్రతి విద్యార్థి నుండి రూ.1000 వసూలు చేసి శానిటేషన్ వర్కర్లకు జీతాలు ఇస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగంగా ప్రకటించారు. రెండవ దఫాలో రూ. 2 వేలు తల్లిదండ్రుల నుండి ప్రభుత్వం వసూలు చేసింది. ఆ రకంగా రెండవ విడత 107 కోట్ల రూపాయలు అమ్మఒడి పథకం నుంచి వసూలు చేసిన నిధులు వివిధ కార్పొరేషన్ల వద్ద డిపాజిట్ అయి ఉన్నాయి. కానీ ప్రభుత్వం ప్రతి నెలా శానిటేషన్ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా కోట్ల రూపాయలను ఇతర పథకాలకు మళ్ళించే ప్రయత్నాలు చేసింది.

ఇప్పటికైనా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. దాదాపుగా 54 వేల మంది శానిటేషన్ కార్మికులు రాష్ట్రంలో పనిచేస్తున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పని చేసే అట్టడుగు వర్గాలకు చెందిన పార్ట్ టైం కంటింజెంట్ వర్కర్ల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చినా పరిష్కరించటంలేదు. వీరికి నెలకు రూ.4 వేల వేతనం ఇచ్చి 8 నుండి 10 గంటలు పనిచేయించుకుంటున్నారు. పేరుకే పార్ట్ టైం పని. చేయించుకునేది ఫుల్ టైం. వీరంతా గత 25 నుండి 33 సంవత్సరాలుగా వెట్టిచాకిరిలో మగ్గుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరు 22 వేల మంది ఉన్నారు.

300 లోపు విద్యార్థులకు ఒక ఆయా, 301 నుండి 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఆయాలు 600 నుండి 900 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఆయాలు 900 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఆయాలను పాఠశాలలో నియమించాలని ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.22లో చెబుతున్నారు. మన ఇంట్లో వాష్‌రూంలను వారంలో ఒకటి రెండు సార్లు క్లీన్ చేస్తాము. అలాంటిది 300 మంది విద్యార్థులకు ఒక్క ఆయా పనిచేయాలి. అంటే ఇది వెట్టిచాకిరి కాక ఏమవుతుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. 'స్వచ్ఛ భారత్' పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నటువంటి ప్రభుత్వాలకు...పాఠశాలలు, కళాశాలలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆరోగ్యాలను పరిరక్షిస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పట్టడం లేదు. వీరి పట్ల ప్రభుత్వాలు చూపుతున్న వివక్షాపూరిత విధానాలకు వ్యతిరేకంగా, తమ డిమాండ్ల సాధన కోసం వారు పోరు బాట పట్టారు. వేతనాలు పెంచాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపుగా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, శానిటేషన్ పరికరాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఇఎస్ఐ, పి.ఎఫ్ వంటి సౌర్యాలు కల్పించాలని, శానిటేషన్ కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర ధర్నాకు తరలిరాబోతున్నారు. అనేక దశాబ్దాలుగా వెట్టిచాకిరికి గురవుతున్న శానిటేషన్ కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు మద్దతుగా నిలవాల్సిన అవసరం నేడు ఎంతైనా వుంది.



- దయా రమాదేవి,
ఎ.పి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), సెల్ : 9490041456

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

అభిప్రాయం


క్యాన్సర్ మందుల్లోనూ కల్తీలేనా...

అనేక రకాల రోగాలతో కార్పొరేట్ వైద్యం చేయించుకునే స్తోమత లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, కొంతమంది మాత్రమే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను ఉపయోగించుకొని ఒడ్డున పడుతున్నారు. మనిషికి ప్రాణం కన్నా విలువైనది మరేదీ ఉండదు. పేషెంట్ ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ కుటుంబ సభ్యులు పడే బాధ వర్ణనాతీతం. ముఖ్యంగా క్యాన్సర్ బారిన పడిన వ్యక్తులు క్యాన్సర్ వ్యాధి వచ్చిందని తెలియగానే మృత్యుముఖంలోనికి వెళ్ళినట్లే ఆందోళన చెందుతారు. దానికి ఆపరేషన్‌తోపాటు, ఖరీదైన యాంటీ బయాటిక్ మందులతో పదుల సంఖ్యలో కీమోథెరఫీలు, కరెంట్ రేడియేషన్లతో కుంగిపోతూ ట్రీట్‌మెంట్ బాధ భరించలేక దీనికంటే మరణమే మేలని, కుటుంబ సభ్యులను ట్రీట్‌మెంట్ కూడా చేయించవద్దని బతిమాలుకునే వారూ వున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా ధనార్జనకోసం మానవత్వాన్ని మరుగుపరచి రాక్షసుల్లా నకిలీ మందులు తయారు చేయడం, వాటిని దళారుల ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడం...పేషెంట్ల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న ఈ పరిస్థితి దారుణం. ఒక్క హైదరాబాద్ లోనే నాలుగు కోట్ల రూపాయల విలువైన క్యాన్సర్ డూప్లికేట్ మందులు పట్టుబడితే దేశవ్యాప్తంగా ఈ దందా ఎంతగా విస్తరించి ఉంటుందో! క్యాన్సర్ పేషెంట్లు వెంటనే మరణం బారిన పడకుండా కొద్దికాలమైనా బతికించేందుకు జరుగుతున్న ఈ చికిత్సలు శారీరకంగాను, ఆర్థికంగాను పేషెంట్లు ఏమాత్రం భరించలేక హాస్పిటల్ బెడ్ మీదనే నరకాన్ని చూస్తారు. అలాంటి వారికి మనం ఎటువంటి సహాయం చేయలేకున్నా మానవత్వంతో కనీసం వారి పట్ల జాలి, కరుణ చూపించడం కూడా లేకుండా వారిని ఈ నకిలీ మందులకు గురిచేసే ఈ దందాను, స్వార్థపరత్వాన్ని, రాక్షస ప్రవృత్తిగా చూడాలి. క్యాన్సర్ కణాలు శరీరంలో పెరగకుండా, నిరోధించడానికి రకరకాల కీమోథెరఫీ ట్రీట్‌మెంట్‌లో వాడే ఆల్కలైటింగ్ ఏజెంట్లు, ప్లాటినం అనలాగ్‌లు, యాంటీ మెటాటోల్కెట్స్, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్, సిల్కెన్ బాటిల్స్ ఇంకా వైట్ సెల్స్ ఇంజక్షన్లు...వీటిలో కూడా డూప్లికేట్ మందులు వాడితే పేషెంట్ల ప్రాణాలు గాలిలో కల్సిపోవాల్సిందే కదా! మరణ భయంతో ప్రాణాలు నిలబెట్టుకోవాడానికి అప్పులపాలై మరీ వైద్యం చేయించుకుంటున్న వారు ఈ నకిలీ మందుల బారిన పడి ప్రాణాలు కోల్పోతే బాధ్యులెవరు? ప్రభుత్వాలు ఈ విషయంలో కఠినమైన చర్యలు తీసుకొని కట్టడి చేయాలి. అసలే క్యాన్సర్ మహమ్మారి బారిన పడి కుంగిపోతున్న వారిని ఈ నకిలీ మందులతో మృత్యువుకు మరింత చేరువ చేయకుండా కాసింత మానవత్వం చూపించండి.

- జోస్యుల వేణుగోపాల్, సెల్: 9440436806

అమెరికా మరింత ఒంటరి!

వ్యాఖ్య



'ఒక వేళనేను మరణించాల్సి వస్తే నా గురించి చెప్పటానికి మీరు జీవించి ఉండాలి' అని చెప్పిన కొద్ది రోజులకే కవి, ప్రొఫెసర్ రిఫాత్ అలారిర్‌తో సహా ఆరుగురు కుటుంబ సభ్యులు తలదాచుకున్న ఇంటిని ఇజ్రాయిల్ మిలిటరీ కూల్చివేసి హత్య చేసింది. ఇలాంటి వారెందరో! పిల్లలను కోల్పోయిన తలిదండ్రులు, తల్లో, తండ్రో ఎవరో ఒకరిని కోల్పోయిన పిల్లలు పాతిక వేలమంది ఉన్నారన్న వార్తలు మానవత్వం ఏ కాస్త మిగిలి ఉన్నా కలచివేసేవే. అక్టోబరు ఏడు నుంచి పాలస్తీనియన్లపై అత్యంత పాశవిక మారణకాండకు పాల్పడుతున్న యూదు దురహంకార దాడులను విరమించాలని కోరుతూ ఐరాస సాధారణ అసెంబ్లీ మంగళవారం నాడు ఒక తీర్మాన్నాన్ని ఆమోదించింది. ఇది ఒక హెచ్చరిక తప్ప ఉల్లంఘించిన ఇజ్రాయెల్ మీద చర్య తీసుకొనేందుకు అవకాశం లేదు. యూదు దురహంకారుల మీద రోజు రోజుకూ వ్యతిరేకత, ప్రత్యేకించి విశ్వ విద్యాలయాల్లో పెరగటంతో జో బైడెన్‌కు సెగ తగిలింది. దాంతో స్వరంలో తేడా వచ్చింది. అనుసరిస్తున్న విధానాలు, చేపడుతున్న ప్రజా, ప్రజాస్వామిక వ్యతిరేక చర్యలు, దుర్మార్గానికి ఇస్తున్న మద్దతు వంటి తీరు తెన్నులతో ప్రపంచంలో అమెరికా మరింతగా ఒంటరి అవుతోంది.

అమెరికా పాటకు అనుగుణ్యంగా నృత్యం చేసేందుకు నిరాకరిస్తూ అత్యంత సన్నిహిత దేశాలైన కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వ్యతిరేకంగా ఓటేశాయి. పాలస్తీనా సమస్య మీద ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రపంచం నుంచి వేరుపడింది. దాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న అమెరికా సైతం చివరికి స్నేహితుల నుంచి కూడా దూరం అవుతుందా అన్నట్లుగా ఉంది. ఆ దేశాలు పూర్తిగా తెగతెంపులు చేసుకుంటాయని అనుకోనవసరం లేదు గానీ అమాయక పౌరుల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయిల్ పట్ల అమెరికాతో కలసి నడిచేందుకు అవి సిగ్గుపడుతున్నాయి. పైన పేర్కొన్న మూడు దేశాలు, బ్రిటన్, అమెరికా కలసి " ఐదు నేత్రాల " పేరుతో గూఢచార సంస్థల సమాచారాన్ని పంచుకుంటున్నాయి. బహుశా దానిలో ఇజ్రాయిల్‌ను సమర్థించే అంశం ఒక్కటి కూడా దొరికి ఉండదు. అందుకే అన్నింటా తోడుండే బ్రిటన్, జర్మనీ చివరికి అమెరికా సాయం కోసం అర్రులు చాస్తున్న ఉక్రెయిన్ కూడా ఐరాస ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గాజాలో తక్షణమే దాడులను విరమించాలన్న తీర్మానాన్ని భద్రతామండలిలో గత శుక్రవారం నాడు అమెరికా వీటో చేసిన తరువాత ఐరాస సాధారణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 153, వ్యతిరేకంగా పది, ఓటింగ్‌కు దూరంగా 23 ఉన్నాయి. ఇదే అంశంపై అక్టోబరు 26న జరిగిన ఓటింగ్‌లో 120-14-45 చొప్పున వచ్చాయి. తాజా ఓటింగ్ తీరు దేశాల వైఖరిలో వచ్చిన మార్పుకు నిదర్శనం. నాటి ఓటింగ్‌లో తటస్థంగా ఉన్న మన దేశం ఈ సారి అనుకూలంగా ఓటు వేయాల్సి వచ్చిందంటే అంతర్గతంగా ఇజ్రాయిల్‌ను బల పరచాలని ఎంతగా ఉన్నప్పటికీ వ్యక్తం చేయలేని స్థితి, సభ్య సమాజం వేలెత్తి చూపుతుందన్న భయం అన్నది స్పష్టం.

అమెరికా పాటకు అనుగుణ్యంగా నృత్యం చేసేందుకు నిరాకరిస్తూ అత్యంత సన్నిహిత దేశాలైన కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వ్యతిరేకంగా ఓటేశాయి. పాలస్తీనా సమస్య మీద ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రపంచం నుంచి వేరుపడింది. దాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న అమెరికా సైతం చివరికి స్నేహితుల నుంచి కూడా దూరం అవుతుందా అన్నట్లుగా ఉంది. ఆ దేశాలు పూర్తిగా తెగతెంపులు చేసుకుంటాయని అనుకోనవసరం లేదు గానీ అమాయక పౌరుల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయిల్ పట్ల అమెరికాతో కలసి నడిచేందుకు అవి సిగ్గుపడుతున్నాయి.

గాజాలో దాదాపు నివాస ప్రాంతాలన్నింటినీ కూల్చివేయట మో, ఉండటానికి పనికిరాకుండా చేయటమో చేశారు. పద్దెమినిది వేలు దాటిన మృతుల్లో సగం మంది పిల్లలే ఉన్నారు. హమాస్ తీవ్రవాదులు దాక్కున్నారంటూ కూల్చివేసిన ఆసుపత్రుల, విద్యా సంస్థల గురించి చెప్పనవసరం లేదు. ఇంత చేసినా బందీలుగా ఉన్న మిగతావారి ఆచూకీ గానీ, హమాస్ సాయుధులు ఎంత మందిని చంపివేసిందీ చెప్పలేని స్థితి ఒకవైపు. మరోవైపు అనేక చోట్ల ఎదురవుతున్న ప్రతిఘటనలో వేలాది మంది ఇజ్రాయెలీ సైనికులు మరణించటమో, కాళ్ల చేతులు పోగొట్టుకోవటమో జరిగిందనే వార్తలు. ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూనే గాజాలో అమాయకుల, పౌరుల ప్రాణాలు పోతున్నాయంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన సందర్భంగా జో బైడెన్ మంగళవారం నాడు మొసలి కన్నీరు కార్చాడు. వచ్చే ఏడాది ఎన్నికల్లో తనకు విరాళాలు ఇచ్చే వారితో జరిపిన సమావేశంలో విచక్షణా రహితంగా బాంబుదాడులు చేస్తున్నందున ప్రపంచమంతటా ఇజ్రాయిల్ మద్దతు కోల్పోతున్నదని కూడా అన్నాడు. మానవ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఇంతకాలం చెప్పిన అమెరికా ఇప్పుడు ఈ విధంగా మాట్లాడటం విధిలేక తప్ప మరొకటి కాదు. ప్రధాని నెతన్యాహు మంచివాడే గానీ అక్కడి ప్రభుత్వం ఆ దిశగా కదిలేందుకు ఆటంకంగా ఉందని, భద్రతా మంత్రి బెన్ గువిర్ మరికొందరు రెండు దేశాలు ఏర్పడాలన్న పరిష్కారాన్ని కోరుకోవటం లేదని బైడెన్ చెప్పటం నయవంచన. పార్టీ ఏదైనా నిజానికి అక్కడి పాలకులు, అధికార యంత్రాంగంలోని వారు దుర్మార్గంలో ఎవరూ ఎవరికి తీసిపోరు, అందరూ అందరే. అలాంటి వారిని బలపరుస్తున్న అమెరికా అధికార, ప్రతిపక్ష నేతలూ వారికేమీ తక్కువకాదు.

- ఫీచర్స్ అండ్ పొలిటిక్స్

మైనర్లయిన అత్యాచార బాధితులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించండి

- **కర్ణాటక హైకోర్టు ఆదేశాలు**

బెంగళూరు : అత్యాచారం, లైంగిక నేరాలపై ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే తప్పనిసరిగా చేయాల్సిన వైద్య పరీక్షలతోపాటు పోక్సో చట్టం కింద ప్రతి ఒక్క అత్యాచార, లైంగిక నేరాల బాధితులకు గర్భధారణ పరీక్ష నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ఈ చర్య వల్ల ఇతర సంబంధిత వైద్య పరిస్థితులు తెలియడంతోపాటు ఒకవేళ గర్భం వచ్చిన పక్షంలో గర్భధారణ సమయాన్ని సాధ్యమైనంత త్వరగా నిర్ధారించడానికి వీలవుతుందని పేర్కొంది. పైగా బాధితురాలి శారీరక, మానసిక స్థితిగతులను అంచనా వేసి, గర్భాన్ని వైద్యపరంగా తొలగించడానికి ఆమె అనువుగా వుందా లేదా అనేది కూడా తెలుతుందని పేర్కొంది. ఇందుకోసం సవివరమైన రీతిలో ప్రామాణిక పద్ధతి (ఎస్ఓపి)ని రూపొందించాల్సిందిగా డిజిపి, ఐజి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శులను కోర్టు ఆదేశించింది. ఇందుకు అవసరమైన నిపుణులను సంప్రదించాలని పేర్కొంది. బెంగళూరు అర్బన్ జిల్లాకి చెందిన 17ఏళ్ల అత్యాచార బాధితురాలి 24వారాల రెండు రోజుల గర్భాన్ని తొలగించేందుకు అనుమతిస్తూ జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ పై ఆదేశాలు జారీ చేశారు. 24 వారాలు దాటినందున గర్భస్రావానికి న్యాయస్థానాల అనుమతి అవసరం కావడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది.

జీవించే హక్కు అందరిదీ...

- **ఆస్ట్రేలియన్ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజ**


తన కుమార్తెతో ఉస్మాన్ ఖవాజ

న్యూఢిల్లీ : 'ఎక్కడ పుట్టాలో ఎక్కడ పెరగాలో ఎవరూ నిర్ణయించుకోలేరు. కాని ఇప్పుడు ప్రపంచమంతా వారి వెనక్కి వెళ్లిపోయింది. నా హృదయం దీన్ని తీసుకోలేకపోతోంది' అంటూ వణుకుతున్న స్వరంతో ఆస్ట్రేలియన్ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజ పాలస్తీనీయన్లకు సంఘీభావంగా ఇటీవల ఓ వీడియో విడుదల చేశారు. ఆయన అంతలా ఎందుకు స్పందించాల్సి వచ్చిందంటే.. 'అన్ని జీవితాలు సమానం', 'స్వేచ్ఛ మానవ హక్కు' అన్న నినాదాలు ఉన్న స్పోర్ట్స్ షూ ధరించి పాకిస్తాన్ టెస్ట్ సిరీస్‌కి సిద్ధమౌతున్న ట్రైనింగ్ సెషన్‌లో అతను పాల్గొన్నాడు. పాలస్తీనీయన్లకు సంఘీభావంగా ఆ దేశ పతాకాన్ని ప్రతిబింబించే రంగుల్లో ఆ నినాదాలను రాసుకున్నాడు. అదే అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి)కి కంటకింపైంది. ఉస్మాన్ ధరించిన షూపై ఐసిసి అభ్యంతరం వ్యక్తం చేసింది. గురువారం జరిగిన ఆస్ట్రేలియా వర్సెస్ పాకిస్తాన్ టెస్ట్ సిరీస్ మ్యాచ్‌లో ఆ షూ ధరించకూడదని నిబంధన పెట్టింది. దీనిపై స్పందిస్తూ బుధవారం ఉస్మాన్ భావోద్వేగభరితంగా ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'నేను వాళ్ల నిర్ణయాన్ని గౌరవిస్తాను. అయితే నేను తీసుకున్న నిర్ణయంపై ఆమోదం వచ్చేవరకు పోరాడతాను. ఎందుకంటే.. తమకు అన్యాయం జరిగిందని చెప్పలేని నిశ్శబ్ద గొంతుకల తరపున నేను మాట్లాడుతున్నాను. అక్కడ ఎటువంటి పశ్చాత్తాపం లేని, పరిణామాలపై ఆలోచన లేని కఠిన మనస్కుల చర్యల వల్ల వేలాది మంది చిన్నారులు అశువులు బాస్తున్నారు. ఇది రాజకీయ సందేశం కాదు. అంతకు మించి.. మానవత్వానికి సంబంధించినది. యుద్ధం మొదలైన దగ్గర నుండి గాజాలో ఇప్పటివరకు 7,700 మంది చిన్నారులు బలయ్యారు. గాయాలతో చికిత్స పొందుతున్న వారితో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఆ బిడ్డల్లో నా ఇద్దరు కూతుళ్లను తలచుకుంటే నా హృదయం కకావికలమైపోతోంది' అంటూ తీవ్ర ఆవేదనతో ఉస్మాన్ మాట్లాడుతున్నప్పుడు అతని గొంతు వణికింది. పంటిబిగువున దు:ఖాన్ని నొక్కిపట్టినా అతని కళ్లల్లో కన్నీటిపొరలు కనిపించాయి. 'స్వేచ్ఛ అందరికీ కాదా' అని ప్రశ్నించాడు. 'వారు ఏ జాతి, ఏ మతం, ఏ సంస్కృతో నాకు అవసరం లేదు. అన్ని జీవితాలు సమానం' అని మాత్రమే నేను చెప్పదలచుకున్నాను. అదే కొంతమందికి నచ్చడం లేదు. ఈరకం వ్యక్తులు నేను ఏ ఉద్దేశంతో రాశానో కూడా అర్థం చేసుకోలేరు. నా రాతల్లో రాజకీయం లేదు. నేను ఎవరి పక్షం వారినీ కాదు. ఈ జీవితం అందరికీ సమానం. ఒక ముస్లిం, ఒక యూదు, ఒక హిందూ అందరికీ జీవించే హక్కు ఉంది' అంటున్న ఉస్మాన్ పాకిస్తాన్ మూలాలున్న ఆస్ట్రేలియా క్రికెటర్. బాల్యంలోనే పాకిస్తాన్ నుండి ఆస్ట్రేలియాకు అతని కుటుంబం వలసొచ్చింది. తన 12 ఏళ్ల కెరీర్‌లో ఆస్ట్రేలియా క్రికెటర్‌గా ఇప్పటివరకు 115 అంతర్జాతీయ క్రీడలు ఆడాడు. ప్రతిభావంత ఆటగాడిగా ప్రపంచ వ్యాప్తంగా ఎందరో క్రీడాబి .మానులను సంపాదిం చుకున్నాడు.

36 ఒప్పందాలపై సంతకాలు

- **వియత్నాం నేతలతో జిన్‌పింగ్ భేటీ**



బ్యాంకాక్ : చైనా, వియత్నాం మధ్య బంధం బలోపేతానికి ఇరు దేశాల అధినేతలు కృతనిశ్చయం వ్యక్తం చేశారు. చైనా నేత సీ జిన్‌పింగ్ మూడు రోజుల పర్యటనలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి గుయెన్ ఫూ ట్రాంగ్, వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్‌తోను సమావేశమయ్యారు. 'భాగస్వామ్య భవిష్యత్తుతో కూడిన సమాజం' దిశగా చైనా, వియత్నాంలు కృషి చేస్తాయని ఇరువురు నేతలు ప్రకటించారు. ఇరు పక్షాలు 36 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వీటిల్లో చాలావరకు ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఉద్దేశించినవే వున్నాయి. టెలి కమ్యూనికేషన్స్ రంగం నుండి రెండు దేశాల మధ్య పరస్పర మార్పిడుల వరకు పలు ఒప్పందాలు వున్నాయని వియత్నాం మీడియా తెలిపింది. బుధవారం నేషనల్ అసెంబ్లీ చైర్మన్ వుయాంగ్ దిన్హ్‌హ్యూతో కూడా జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ఉభయ పక్షాలు వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. వియత్నాం, చైనా స్కాలర్లతో కూడా జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ఖైదీల మార్పిడికి ఇరు పక్షాలు అంగీకరించాయి. వాటికి సంబంధించిన వివరాలు ఇంకా పూర్తిగా వెల్లడి కాలేదు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో కూడా సహకరించుకునే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇరు దేశాల మధ్య కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు వున్నప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టంగానే వున్నాయి. దక్షిణ చైనా సముద్ర జలాల్లోని దీవులపై హక్కులకు సంబంధించి విభేదాలు వున్నాయి. మొత్తంగా వ్యూహాత్మక జల మార్గంపై హక్కు తమదేనని చైనా చెబుతుండగా, ఫిలిప్పైన్స్ వియత్నాం, మలేసియా, బ్రూనై, తైవాన్‌లు వేర్వేరుగా తమ వాటాల కోసం పట్టుబడుతున్నాయి.

షాహీ ఈద్గా మసీదు సర్వే చేయండి

- **అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు**

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని మథురలో గల షాహీ ఈద్గా మసీదును న్యాయస్థానం నియమించిన, పర్యవేక్షించే అడ్వకేట్ కమిషనర్ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఆమోదం తెలిపింది. ఇది కృష్ణుడు జన్మించిన ప్రదేశమంటూ హిందూ మతతత్వ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయస్థానం పై విధంగా స్పందించటం గమనార్హం. స్థలాన్ని సర్వే చేయడానికి కమిషన్‌ను నియమించాలన్న విజ్ఞప్తిని కోర్టు అనుమతించిందని పిటిషనర్ల తరపు న్యాయవాది రంజనా అగ్నిహోత్రిని తెలిపారు. పిటిషనర్ల తరపు మరో న్యాయవాది విష్ణు శంకర్ జైన్ మాట్లాడుతూ.. "అడ్వకేట్ కమిషనర్‌ను తప్పనిసరిగా నియమించాలన్న మా డిమాండ్‌ను కోర్టు అనుమతించింది. అడ్వకేట్ కమిషనర్ ఎవరు? విధివిధానాలు ఎలా ఉంటాయి? త్రిసభ్య కమిటీ వేయాలా? ఈ విషయాలన్నీ ఈనెల 18న నిర్ణయించబడతాయి" అని చెప్పారు. 13.37 ఎకరాల భూమిని ఆలయ నిర్వహణకు పూర్తి యాజమాన్యం ఇవ్వాలని కోరుతూ మథురలోని వివిధ కోర్టుల్లో మొత్తం 18 వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు ఈ అన్ని అభ్యర్థనలను కలుపుకొని ఈ అంశంపై తీర్పు కోసం వాటిని స్వయంగా బదిలీ చేసింది. ఆగస్టు 15, 1947న ఉన్న ఏ ప్రార్థనా స్థలం అయినా మతపరమైన హోదాను కొనసాగించే 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉటంకిస్తూ పిటిషన్‌లను రద్దు చేయాలని ప్రార్థిస్తూ మసీదు పక్షం గతంలో హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తుందని అంతా భావిస్తున్నారు.

రచయిత సోమేపల్లి కన్నుమూత



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రముఖ రచయిత, జిల్లా పరిషత్ మాజీ సిఇఒ సోమేపల్లి వెంకట సుబ్బయ్య (66) గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుంటూరు విజయపురి కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా వెంకట సుబ్బయ్య పని చేశారు. జిల్లా పరిషత్ సిఇఒ, పులిచింతల ప్రత్యేక కలెక్టరుగా పని చేసి రిటైర్డు అయ్యారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు కార్యాలయంలో ఒఎస్‌డిగా పనిచేస్తున్నారు. 'లోయలో మనిషి, తొలకరి చినుకులు, చెల్లకవ్వం, రెప్పల చప్పుడు, తదేక గీతం, పచ్చని వెన్నెల, మట్టి పొరలు, చేనుచెక్కిన శిల్పాలు, నాగలికి నా నమస్కారం' పేరుతో ఆయన పలు పుస్తకాలను రచించారు. ఆయన రచనలకు పలు అవార్డులు, పురస్కారాలు లభించాయి. ఆయన రెండవ కుమారుడు విదేశాల్లో ఉండడం వల్ల అంత్యక్రియలు శనివారం జరిగే అవకాశం ఉంది. సోమేపల్లి మృతికి ఎంపి శ్రీకృష్ణదేవరాయులు, పలువురు సాహితీవేత్తలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మరో మూడేళ్లు ఇఎమ్‌డిపి పాఠశాలల్లో అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో మరో మూడేళ్లు ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇఎమ్‌డిపి) కార్యక్రమాన్ని కొనసాగించేలా పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అఫ్లాటౌన్ ఇంటర్నేషనల్, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, రీప్ బెనిఫిట్ సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందని కమిషనర్ సురేష్‌కుమార్ అన్నారు. మూడేళ్లుగా అమలవుతున్న ఇఎమ్‌డిపి ఒప్పందాన్ని మరో మూడేళ్లు కొనసాగిస్తూ గురువారం సమగ్ర శిక్షా కార్యాలయంలో ఎంఒయు చేసుకున్నారు. 9వ తరగతి విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వాన్ని, ఆర్థిక నైపుణ్యాలతో సహా 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి పరచడంలో ఈ కార్యక్రమం తోడ్పడుతుందని సురేష్ చెప్పారు. ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఇఎమ్‌డిపి ఎక్స్‌పో నిర్వహించాలని డిఇఒలను కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు, ఫౌండేషన్ ప్రతినిధులు శ్యామ్ సూర్యనారాయన్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం కోసం 36 గంటల దీక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆశాల వంటా-వార్పు
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలి : ధనలక్ష్మి



ఏలూరులో నిర్వహించిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ధనలక్ష్మి, వేదికపై షాబ్జీ, టిడిపి నాయకులు, తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, పని భారం తగ్గించాలని, గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు 36 గంటల దీక్షకు దిగారు. ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. జీతాలు పెంచు తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా నేటి వరకు పెంచిన జీతం అమలు కావడం లేదని, వచ్చే జీతం లో సగం టిఎ, డిఎలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో పలువురు ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాను ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రారంభించారు. ముందుగా స్థానిక ఏలూరు జ్యూట్ మిల్లు నుండి ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ధనలక్ష్మి మాట్లాడుతూ.. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా తక్షణం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఆశా వర్కర్లకు రూ.10 లక్షల నష్టపరిహారమివ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేలు జీతం ఇస్తున్నామనే పేరుతో 14 రకాల యాప్‌లు, 26 రిజిస్టర్లు నిర్వహించాలంటూ విపరీతమైన పనిభారం మోపిందని విమర్శించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలు అమలు చేయకుండా మాట తప్పి, మడమ తిప్పారని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ..ఆశాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ వద్ద, కాకినాడలో కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరాలను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహిం చిన ధర్నాలో కె.ధనలక్ష్మి పాల్గొన్నారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాకు ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు హాజరై మద్దతు తెలిపారు. కృష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష శిబిరాన్ని ధనలక్ష్మి సందర్శించి మాట్లాడారు. 36 గంటల నిరసన ధర్నాలోపు కార్యకర్తల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని లేదంటే ముఖ్యమంత్రి ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, టిడిపి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ.. వారాంతపు సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నిటీ లీవులు, ఇతర పండుగ సెలవులు కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నా రన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. అనంతపురంలో నిర సన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న ఆశ కార్య కర్తలను పోలీసులు అడ్డగించి అరెస్టులు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం, మడకశిర ప్రాం తాల్లో ఆర్‌టిసి బస్సులు, ఆటోల్లో వస్తున్న వారిని అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో ఉంచి తరువాత విడుదల చేశారు.

విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహా ధర్నా, వంటా-వార్పు చేశారు. రాత్రికి వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా ప్రారంభమైంది. అల్లూరి జిల్లాలోని చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ ఎదుట ధర్నాలు చేశారు. శ్రీకాకుళం, నెల్లూరు, తిరుపతి, నంద్యాల, వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టారు. ఆందోళనలో భాగంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టి అక్కడే భోజనాలు చేసి రాత్రి కూడా అక్కడే నిద్రించారు.

వ్యవస్థలను పరిరక్షించుకోవాలి

నిరసన ప్రజల హక్కు : సిఎఫ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రజలు చైతన్యవంతం కావాలని మాజీ డిజిపి ఎంవి భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలో సిటిజన్ ఫర్ డెమోక్రసీ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వ్యవస్థలు చాలా బలహీనంగా వున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని గుర్తు చేసేందుకే సిటిజన్ ఫర్ డెమోక్రసీ పనిచేస్తుందన్నారు. నిరసన, వాక్‌స్వాతంత్ర్యం ప్రజలకు హక్కుగా వుందని తెలిపారు. ప్రభుత్వాలు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు ప్రజలు కచ్చితంగా ప్రశ్నించాలని కోరారు. మాజీ అడిషన్ అడ్వకేట్ జనరల్ ఎ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతుంటాయని, వ్యవస్థలనేవి శాశ్వతమని తెలిపారు. బిల్లులను ఆమోదించే సభ్యులకు కూడా తెలియకుండా చట్టాలు తయారుకావడం సమాజానికి మంచిదికాదన్నారు. ప్రస్తుతం జ్యూడీషియల్ వ్యవస్థ కూడా బలహీన పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రభుత్వాలకు బాధ్యతలను గుర్తు చేయాలని తెలిపారు. హిందూ పత్రిక మాజీ రెసిడెంట్ ఎడిటర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన అనేది ప్రజల హక్కుగా వుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రభుత్వాలు కాలరాయాలని చూస్తే ప్రశ్నించాలన్నారు. సిఎఫ్‌డి కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థ అనేది అన్ని శాఖల కంటే క్రమశిక్షణ కలిగిన సంస్థ అని తెలిపారు. ఆ శాఖలో పై అధికారి చెప్పినప్పుడు ఏమీ మాట్లాడకుండా పనిచేయడమే కింది స్థాయి అధికారుల బాధ్యత అని అన్నారు. సివిల్ సర్వీస్‌లో వున్న అధికారులు సామాజిక స్పృహతో బాధ్యతగా వ్యవహరిస్తే అంతా సవ్యంగా సాగుతుందన్నారు. అధికార దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదేనని అన్నారు. సమావేశంలో సిఎఫ్‌డి సహాయ కార్యదర్శి వి లక్ష్మణ్ మాట్లాడారు.

బసవపున్నయ్య బాటలో విజ్ఞాన కేంద్రం

- జయంతి సభలో ఛైర్మన్ పి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాకినేని బసవపున్నయ్య ఆశయ బాటలోనే ఆయన పేరుతో ఉన్న విజ్ఞాన కేంద్రం మహిళలు, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి మధు అన్నారు. కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ వంటి అనేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధులు, మార్క్సిస్టు మేధావి మాకినేని బసవపున్నయ్య 109వ జయంతి కార్యక్రమం గురువారం విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఇన్‌ఛార్జి బిఆర్ తులసీరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మాకినేని బసవపున్నయ్య చిత్రపటానికి మధు, సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. బసవపున్నయ్య స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడటంతో పాటు వివక్షకు గురవుతున్న దళితులు, మహిళల పక్షాన పెద్దఎత్తున పోరాడారని తెలిపారు. దళితులు, మహిళలు, సామాజిక న్యాయం కోసం పోరాటం చేయటమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రభాగాన నిలిచిపోరాటం చేశారని అన్నారు. దళితులు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిసలూ పాటుపడ్డారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అన్ని రకాల అసమానతలు లేని స్వాతంత్ర్యం రావాలని కోరుకున్న వ్యక్తి అని కొనియాడారు. దేశంలోనే ఆధునిక శాస్త్రీయ ఆలోచనలు ఉన్న మేధావుల్లో అగ్రగణ్యులని చెప్పారు. భాషా సాంస్కృతిక వికాసం, అభ్యున్నతి కోసం తెలంగాణ నైజాంకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాడారని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన ప్రజలకు సేవ, అభ్యున్నతి, సాంస్కృతిక వికాసం కోసం ఆయన పేరుతో ఉన్న విజ్ఞాన కేంద్రం పనిచేస్తోందన్నారు. ఎంబివికె ట్రస్టు కార్యదర్శి వై వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి మురళీకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు యువి రామరాజు, టి క్రాంతికిరణ్, స్వరూపరాణి, గుండు నారాయణ, ఎస్‌పి రామరాజు, పి విజయ, వై సుబ్బారావు, మాల్యాద్రి, రామన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేట్‌పరమైతే నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

- పోరాట కమిటీ నాయకులు



దీక్షల్లో కూర్చున్న స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్లాంట్ ప్రయివేటు పరమైతే నిర్వాసితులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు ఉద్యోగ కల్పన అనేదే లేకుండా పోతుందనివిశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు యు రామస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని క్రమేపీ తగ్గిస్తూ, విభాగాలను నిర్వీర్యం చేస్తూ ప్లాంట్‌ను సహజ మరణం దిశగా నెట్టడం దారుణమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1036వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. ఇప్పటికే రా మెటీరియల్ సరఫరా విషయంలో అన్యాయం చేసిన కేంద్రం.. నేడు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడానికీ అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు, కారు రమణ, చిత్రాడ సన్యాసిరావు, జె రామకృష్ణ, దాసరి శ్రీనివాస్, సైన్ బాబు, సాయిరాం, కొణతాల శ్రీను, గోపి పాల్గొన్నారు.

మలివిడత జాబితాపై కసరత్తు

- వైసిపి సిట్టింగులలో టెన్షన్
- వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు దూరమయ్యామని ఆవేదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తి, వ్యతిరేకతను అధిగమించేందుకు కొత్త అభ్యర్థులను రంగంలోకి తెచ్చేందుకు వైసిపి అధిష్టానం చేపట్టిన కసరత్తు సిట్టింగు ఎమ్మెల్యేలకు టెన్షన్ పుట్టిస్తోంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించి, ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలన్నింటిలో తిరుగులేని విజయాలను దక్కించుకున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ 2024 ఎన్నికలకు దాదాపు 100 మంది సిట్టింగులను మారిస్తేగాని ఫలితం దక్కదనే సర్వే నివేదికలు ఆ పార్టీలోనే గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇటీవల వైసిపి అధిష్టానం 11 నియోజకవర్గాలకు ఎమ్మెల్యేల స్థానంలో ఇన్‌ఛార్జులను నియమించడం ప్రారంభించింది. ఈ మార్పులపై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత రావడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మంత్రులపైనే వ్యతిరేకత ఉందంటే ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటనే చర్చ జరుగుతోంది. నిధుల కొరతతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యామని, పెన్షన్, ఇతర సంక్షేమ పథకాల ఎంపికను వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది చేతిలో పెట్టడంతో ప్రజలకు దగ్గరయ్యే అవకాశమే తమకు లేకుండా పోయిందని పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వంపై వున్న వ్యతిరేకతను తమపై రుద్ది పోటీ చేసేందుకు అవకాశం లేకుండా చేస్తే ఇన్నేళ్లు రాజకీయంగా తమను అంటిపెట్టుకుని వున్న కార్యకర్తల పరిస్థితి ఏమిటంటూ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో వున్నా, లేకున్నా గెలుపోటములతో సంబంధం లేకుండా నియోజకవర్గంలో పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉన్న తమను వున్న పళంగా పోటీకి దూరం చేస్తే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. రాష్ట్రంలో 2024 ఎన్నికలకు ఎవరుంటారనే మలివిడత జాబితాను పార్టీ అధిష్టానం త్వరలో విడుదల చేస్తుందనే సమాచారం ఎమ్మెల్యేల్లో టెన్షన్ పుట్టిస్తోంది. వరుసగా మార్పులు చేర్పులు ప్రకటించాలని అనుకున్నప్పటికీ తొలివిడత మార్పుల్లోనే పెద్దయెత్తున వ్యతిరేకత రావడం, రాజీనామాల పర్వం కొనసాగడంతో కొంత సమయం తీసుకోవాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే మార్పులు చేయాలనుకున్న జిల్లాలకు ప్రాంతీయ పరిశీలకులు, పార్టీలో కీలకమైన వ్యక్తులను ఆయా జిల్లాలకు పంపించి సర్ది చెప్పించే కార్యక్రమం మొదలుపెట్టింది. ఏ నియోజకవర్గంలో ఎవరిని మారుస్తున్నారు? అక్కడ ఎవరిని పెడుతున్నారు అనే అంశాలను ముందుగా వారికి చెప్పి ద్వితీయ శ్రేణి నాయకత్వంతోనే సంప్రదింపులు జరుపుతున్నారు. దీని ద్వారా కొంత వ్యతిరేకతను తగ్గించుకోవచ్చనే ఆలోచనతో వైసిపి నాయకత్వం ఉంది. ప్రస్తుతం వైవి సుబ్బారెడ్డి ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అలాగే పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహించాల్సిందేనంటూ చేస్తున్న హెచ్చరికలు ఏ స్థాయిలో పనిచేస్తాయనేది చర్చనీయాంశమైంది.

ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకుంది మేమే

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం కిడ్నీ బాధితులను అన్ని విధాలా టిడిపినే ఆదుకుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తెలిపారు. రూ.1,900 కోట్ల వ్యయంతో ఉద్దానంలో సురక్షిత తాగునీరు పనులకు చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం భూమి కేటాయించడంతోపాటు అన్ని అనుమతులతో 2019 ఫిబ్రవరి 12న జిఒ 111ను విడుదల చేసి పనులు మొదలుపెట్టిందని తెలిపారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు నాలుగున్నరేళ్లు దాటినా పూర్తికాలేదని ఆరోపించారు. అయినా ఎన్నికల స్టంట్ కోసం ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. ఇచ్ఛాపురం, కవిటి, పలాస, టెక్కలి, పాలకొండ, శ్రీకాకుళంలో 6 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిపై బొబ్బిలి వైసిపి ఎమ్మెల్యే చిన అప్పలనాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నోరు విప్పాలని టిడిపి అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులు ఆచంట సునీత డిమాండ్ చేశారు. తప్పు ఒప్పుకుని అప్పలనాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఐఎన్‌ఎస్ తర్ముగ్లీ జలప్రవేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐఎన్‌ఎస్ తర్ముగ్లీ ఫాస్ట్ ఎటాక్ క్రాఫ్ట్ (ఎఫ్ఎసి) యుద్ధనౌక గురువారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో ఉన్నతాధికారుల సమక్షంలో జలప్రవేశం చేసింది. ఫాస్ట్ ఎటాక్ క్రాఫ్ట్‌గా రూపొందిన ఈ నౌకకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. తొలుత 2006లో మాల్దీవియన్ నేవల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఎంఎన్‌డిఎఫ్)కు దీన్ని కేంద్ర ప్రభుత్వం బహుమతిగా ఇచ్చింది. ప్రస్తుతం ఈ నౌక ఈ ఏడాది మేలో పోస్ట్ ఎక్స్‌టెన్సివ్ రిస్టోరేషన్ పనులకు నేవల్ డాక్‌యార్డుకు విచ్చేసింది. ఆరు నెలల పాటు అన్ని పరీక్షలనూ పూర్తిచేసుకుని రీ-ఇండక్షన్ (పున:ప్రవేశం) గురువారం చేసింది. ఈ యుద్ధ నౌక పూర్తిగా మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో నేవల్ డాక్‌యార్డులో ఫిట్టింగ్ చేయబడింది. ఎంటియు ఇంజిన్లు, వాటర్ జెట్ యంత్ర సామగ్రి, అబ్బురపరిచే తాజా కమ్యూనికేషన్ వ్యవస్థ, 30 ఎంఎం గన్, అడ్వాన్స్‌డ్ రాడార్ సిస్టంతో సిద్ధం చేయబడింది. తీర గస్తీ (కోస్టల్ సర్వేలెన్స్) కోసం, దేశంలోని తూర్పు కోస్తా తీరం, కెజీ బేసిన్ రక్షణ కోసం ప్రత్యేకించి ఉద్దేశించిన నౌకగా దీన్ని మరింతగా సిద్ధం చేశారు. ఐఎన్‌ఎస్ తర్ముగ్లీకి కమడోర్ సత్పాల్‌సింగ్ కమాండింగ్ అధికారిగానూ, ఆంధ్రప్రదేశ్‌లో ఇన్చార్జిగానూ వ్యవహరించనున్నారు.

రుషికొండలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని రుషికొండ ప్రాంతంలో కేంద్ర పర్యావరణ సాంకేతిక నిపుణుల బృందం గురువారం ఉదయం 11 గంటల సమయంలో పర్యటించింది. మూడు కార్లలో కమిటీ కొండపైకి వెళ్లి రెండు గంటల పాటు పరిశీలన జరిపింది. అక్కడ నిర్మాణంలో ఉన్న భవంతులన్నింటిలో కమిటీ సభ్యులు కలియదిరిగారు. వృక్షాల గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. మీడియా సిబ్బందికి తారసపడకుండా రహస్యంగా ఈ పర్యటన సాగడం గమనార్హం. కార్లలో కొండపైకి వెళ్లిన కేంద్ర బృందం పలు విషయాలను అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నట్లు భోగట్టా. ఎంత వరకూ నిర్మాణాలు వచ్చాయి ? ఇంకా ఎంత పని మిగిలి ఉంది ? కొండపై భాగంలో పర్యావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి ? అన్న విషయాలను మదించినట్లు తెలుస్తోంది.

విజయవాడకు సిబిఎస్ఇ ప్రాంతీయ కార్యాలయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిబిఎస్ఇ ప్రాంతీయ కార్యాలయం ఇబ్రహీపట్నం నుంచి విజయవాడకు మారింది. ఇబ్రహీపట్నంలోని ఆంజనేయ టవర్స్ భవనంలో ఇప్పటి వరకు ఈ కార్యాలయం కొనసాగింది. ఇప్పుడు విజయవాడలోని గవర్నర్‌పేటలోని స్టాలిన్ సెంట్రల్‌కు మారింది. ఈ కార్యాలయాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1000 పాఠశాలలను సిబిఎస్ఇ సిలబస్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. సక్రమంగా అమలు చేయడానికి, విధాన పరమైన సమస్యలు పరిష్కార దిశగా బోర్డు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబిఎస్ఇ రీజనల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సాన్యం భరద్వాజ్, జాయింట్ డైరెక్టర్ ఎంవి కృష్ణారెడ్డి, వి అరుణ తదితరులు పాల్గొన్నారు.

టెస్టుల్లో మహిళల రికార్డు

- తొలిరోజే 400కు పైగా పరుగులు
- టెస్ట్ చరిత్రలో రెండోసారి
- శుభా, రోడ్రిగ్స్, యస్టిక, దీప్తి అర్ధసెంచరీలు
- భారత్ 410/7
- ఇంగ్లండ్ మహిళలతో ఏకైక టెస్ట్



సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన శుభ, రోడ్రిగ్స్

ముంబయి: ఇంగ్లండ్ మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత మహిళలు బ్యాటింగ్‌లో కదం తొక్కారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి భారతజట్టు 94ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 410పరుగులు చేసింది. మహిళల టెస్ట్ క్రికెట్‌లో ఓ జట్టు 400కు పైగా పరుగులు చేయడం ఇది రెండోసారి మాత్రమే. టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్స్ శోభ సతీశ్(69), జెమిమా రోడ్రిగ్స్(68), యస్టికా భాటియా(66), దీప్తి శర్మ(60నాటౌట్) తొలిరోజు అర్ధసెంచరీలతో రాణించగా.. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(49) చిన్న తప్పిదంతో అర్ధసెంచరీని తృటిలో చేజార్చుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు స్మృతి మంధాన(17), షెఫాలీ వర్మ(19) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. ఆ తర్వాత శుభా సతీశ్(69), జెమీమా రోడ్రిగ్స్(68) ఆదుకున్నారు. వీళ్లిద్దరూ కలిసి 3వ వికెట్‌కు రికార్డు స్థాయిలో 115 పరుగులు జోడించారు. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్(49) హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. యస్టికా భాటియా, దీప్తి శర్మ(60నాటౌట్) ధనాధన్ ఆటతో ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించారు. దాంతో, టీమిండియా తొలిరోజే 7వికెట్ల నష్టానికి 410పరుగులు చేసింది. సతీశ్ శుభా, జెమీమా రోడ్రిగ్స్, పేసర్ రేణుకా సింగ్ టెస్టుల్లో అరంగేట్రం చేశారు. లారెన్ బెల్‌కు రెండు, క్రాస్, బ్రంట్, డీన్, ఎక్లేస్టోన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

హర్మన్ మరోసారి సిల్లీగా..

టీమిండియా మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి సిల్లీగా ఔటయ్యింది. హర్మన్ ఇలా ఔటవ్వడం ఇది రెండోసారి. వన్డేల్లో ఓసారి ఆస్ట్రేలియాపై ఇదే తరహాలో వెనుదిరిగిన హర్మన్.. ఈసారి 49 పరుగుల వద్ద వ్యక్తిగత స్కోర్‌వద్ద సింగిల్ తీయాలనుకుంది. కానీ, బంతిని గమనించిన నాన్‌స్ట్రయికర్ యస్టికా భాటియా పరుగుకు నిరాకరించి వెనక్కి పంపింది. దాంతో రనౌట్ తప్పించుకునేందుకు ఆమె క్రీజువైపు పరుగెత్తింది. గీతపై బ్యాటు కూడా పెట్టింది. అయితే.. ఊహించని విధంగా బ్యాటు క్రీజులో ఇరుక్కుపోయింది. అప్పటికే డానియెల్లే వ్యాట్ విసిరిన బంతి నేరుగా వికెట్లను గిరాటేసింది. దాంతో, థర్డ్ అంపైర్ రిప్లే అనంతరం హర్మన్‌ప్రీత్‌ను ఔట్‌గా ప్రకటించారు. దాంతో, ఆమె నిరాశగా పెవిలియన్ బాట పట్టింది.

స్కోర్‌బోర్డు..

భారత మహిళల తొలిఇన్నింగ్స్: స్మృతి మంధాన (బి)లారెన్ బెల్ 17, షెఫాలీ వర్మ (బి)క్రాస్ 19, శుభా సతీశ్ (సి)స్కీవర్ బ్రంట్ (బి)ఎక్లేస్టోన్ 69, రోడ్రిగ్స్ (బి)లారెన్ బెల్ 68, హర్మన్‌ప్రీత్ (రనౌట్) వాట్ 49, యస్టికా భాటియా (సి)లారెన్ బెల్ (బి)ఛార్లీ డీన్ 66, దీప్తి శర్మ (బ్యాటింగ్) 60, స్నేహ్ రాణా (బి)స్కీవర్ బ్రంట్ 30, పూజ వస్త్రాకర్ (బ్యాటింగ్) 4, అదనం 28, (94 ఓవర్లలో 410పరుగులు) **వికెట్ల పతనం:** 1/25, 2/47, 3/162, 4/190, 5/306, 6/313, 7/405 **బౌలింగ్:** క్రాస్ 14-0-64-1, లారెన్ బెల్ 15-1-64-2, స్కీవర్ బ్రంట్ 11-4-25-1, లారెన్ ఫిలర్ 15-1-84-0, ఛార్లొట్ 17-1-62-1, ఎక్లేస్టోన్ 22-4-85-1.

సూర్య సూపర్ సెంచరీ

- చివరి టి20లో దక్షిణాఫ్రికాపై 105పరుగుల తేడాతో భారత్ గెలుపు
- సిరీస్ 1-1తో సమం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 201 పరుగులు చేయగా.. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 13.5ఓవర్లలో 95పరుగులకే ఆలౌటైంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(100; 56 బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు) సెంచరీకి తోడు జైస్వాల్(60; 41బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు) అర్ధసెంచరీతో మెరిసాడు. మహరాజ్, విలియమ్స్‌కు రెండేసి, బర్గర్, షాంసీకి ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికాను స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(5/17), జడేజా(2/25) కట్టడి చేశారు. దీంతో మూడు టి20ల సిరీస్ 1-1తో సమం కాగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్‌కు లభించింది. ఇరుజట్ల మధ్య మూడు టి20ల సిరీస్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది.

రాజస్తాన్‌ను ఫైనల్‌కు చేర్చిన దీపక్ హుడా

- సెమీస్‌లో కర్ణాటకపై ఏడు వికెట్ల తేడాతో గెలుపు
- విజయ్ హజారే వన్డే టోర్నీ



దీపక్ హుడా (180పరుగులు)

రాజ్‌కోట్: కెప్టెన్ దీపక్ హుడా(180) భారీ శతకానికి తోడు కరణ్ లాంబ(73నాటౌట్) అర్ధసెంచరీతో రాణించడంతో రాజస్తాన్ జట్టు తొలిసారి విజయ్‌హజారే వన్డే టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సౌరాష్ట్ర స్టేడియంలో గురువారం జరిగిన రెండో సెమీస్‌లో కర్ణాటక నిర్దేశించిన 283పరుగుల లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు 43.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 282పరుగులు చేసింది. టాప్‌ఆర్డర్ బ్యాటర్స్ సమర్థ్(8), కెప్టెన్ మయాంక్ అగర్వాల్(13), నికిన్ జోస్(21), వికెట్ కీపర్ కృష్ణన్(37) నిరాశపరిచారు. కర్ణాటక జట్టు 87పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో అభినవ్ మనోహర్(91), మనోజ్(63) అర్ధసెంచరీలతో కదం తొక్కారు. అంకిత్ చౌదరి, అజయ్ సింగ్‌కు రెండేసి, ఖలీల్ అహ్మద్, అరాఫత్ ఖాన్, రాహుల్ చాహర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో రాజస్తాన్ ఓపెనర్లు అభిజిత్ థోమర్(0), మోహన్ చౌహాన్(0) డకౌట్లయినా.. కెప్టెన్ దీపక్ హుడా స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌కి తోడు కరన్ లాంబా అర్ధసెంచరీతో కదం తొక్కారు. వీరిద్దరూ కలిసి 4వ వికెట్‌కు ఏకంగా 255పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కర్ణాటక బౌలర్లు కౌశిక్, వ్యాషక్, మనోజ్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. శనివారం జరిగే ఫైనల్లో రాజస్తాన్ జట్టు టైటిల్‌కై హర్యానా జట్టుతో తలపడనుంది.

అస్సాంలో 1200కు పైగా మదర్సాల మూసివేత

- 'మిడిల్ ఇంగ్లీష్ స్కూల్స్'గా మార్చిన బిజెపి ప్రభుత్వం

గౌహతి : అస్సాంలోని హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం 1,281 మదర్సాలను మూసివేసి, వాటిని 'మిడిల్ ఇంగ్లీష్ స్కూల్స్'గా మార్చివేసింది. ఈ విషయాన్ని విద్యా శాఖ మంత్రి రనోజ్ పెగు సోషల్ మీడియా ద్వారా గురువారం ప్రకటించారు. రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో ఏకరూపత, సమగ్రతను ప్రోత్సహించడానికి ఈ ప్రక్రియను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

డేనియల్, అలీ అబులకు ఇందిరా గాంధీ శాంతి అవార్డు

న్యూఢిల్లీ : డేనియల్ బారెన్‌బోయిమ్, అలీ అబు అవ్వాద్‌లకు ఇందిరా గాంధీ శాంతి అవార్డు 2023ను సంయుక్తంగా ప్రకటించారు. ఇజ్రాయిల్-పాలస్తీనా సంక్షోభం నివారణకు అహింసా తీర్మానం కోసం ఇజ్రాయిల్, అరబ్ ప్రపంచానికి చెందిన యువకులు, ప్రజలను ఏకతాటిపై తీసుకునిరావడానికి కృషి చేస్తున్నందుకు ఈ అవార్డును ప్రకటించారు. ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి అవార్డు అంతర్జాతీయ జ్యూరీకి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి టిఎస్ ఠాకూర్ అధ్యక్షత వహించారు. అర్జెంటీనాలో జన్మించిన బారెన్‌బోయిమ్ ప్రముఖ క్లాసికల్ పియానిస్ట్, స్వరకర్తగా గుర్తింపు పొందారు.

పశ్చిమ ఆసియాలో సామరస్యాన్ని పెంపొందించడానికి సంగీతాన్ని ఉపయోగిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించారని జ్యూరీ పేర్కొంది. అలీ అబు అవ్వాద్ పాలస్తీనాకు చెందిన ప్రముఖ శాంతి కార్యకర్త. ఇజ్రాయిల్-పాలస్తీనా వివాదంలో గాంధేయ సూత్రాలతో శాంతియుత పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని జ్యూరీ తెలిపింది.

జి20 నిర్వహణ ఖర్చు రూ.416 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జి20 సమావేశాల నిర్వహణకు రూ.416 కోట్లు ఖర్చు చేసినట్లు విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి. మురళీధరన్ తెలిపారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జి20 సమావేశాల నిర్వహణకు రూ.416.19 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

సబార్డినేట్ కోర్టుల్లో 5,443 జ్యుడీషియల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీ

దేశంలో సబార్డినేట్ కోర్టుల్లో 5,443 జ్యుడీషియల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. రాజ్యసభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 83, తెలంగాణలో 115 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అత్యధికంగా గుజరాత్‌లో 545 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై రాజ్యసభ ఛైర్మన్‌కు ఖర్గే లేఖ

పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఛైర్మన్ జగ్దీప్ ధన్‌కర్‌కు లేఖ రాశారు. సహచర ఇండియా పార్టీల సభాపక్ష నేతలతో సంప్రదింపులు జరపగా, రాజ్యసభలో 267 నిబంధన కింద చర్చ జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమైందని లేఖలో ఖర్గే ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై సమగ్ర చర్చ చేపట్టి కేంద్ర హోం మంత్రి సమాధానం ఇచ్చేవరకూ ఎలాంటి ఇతర అంశాలనూ చేపట్టరాదని కోరారు.

బైడెన్‌పై అభిశంసన విచారణ

- యుఎస్ ప్రతినిధుల సభ ఆమోదం

వాషింగ్టన్ : అధ్యక్షుడు జో బైడెన్‌పై అభిశంసన విచారణకు అమెరికా ప్రతినిధుల సభ మంగళవారం అనుమతించింది. రాజకీయ కారణాలతో చేపట్టిన ఈ ప్రక్రియకు రిపబ్లికన్లు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు. ఈ దర్యాప్తునకు అధ్యక్షుడి వ్యవహార శైలికి సంబంధించిన సాక్ష్యాధారాలు అందాల్సి వుంది. 221-212 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది.

ఒకవేళ సెనెట్ విచారణలో దోషిగా తేలితే పదవి నుండి వైదొలగే అవకాశం కూడా వుంటుంది. ఈ బాధ్యతను తాము తేలిగ్గా తీసుకోవడం లేదని స్పీకర్ మైక్ జాన్సన్, ఆయన నాయకత్వ బృందం ఒక సంయుక్త ప్రకటనలో వ్యాఖ్యానించాయి. దర్యాప్తు ఫలితం ఇలాగే వుండబోతుందని కూడా ఊహించబోమన్నారు. సాక్ష్యాధారాలు లభ్యమైతే వాటిని నిర్లక్ష్యం చేయడం సాధ్యం కాదని అన్నారు. బైడెన్ కుటుంబ సభ్యుల వ్యాపార లావాదేవీలకు సంబంధించి దాదాపు ఏడాది కాలంగా సాగుతున్న దర్యాప్తులో పురోగతి ఏమిటో చెప్పాల్సిందిగా జాన్సన్ ఆయన బృందానికి ఒత్తిడి ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సిక్కింలో 800 మంది పర్యాటకులను రక్షించిన సైన్యం

గ్యాంగ్‌టక్ : తూర్పు సిక్కింలోని ఎత్తైన ప్రాంతంలో చిక్కుకుపోయిన 800 మందికి పైగా పర్యాటకులను భారత సైన్యం బుధవారం రక్షించిందని అధికారులు తెలిపారు. హిమపాతం, ప్రతికూల వాతావరణం కారణంగా తూర్పు సిక్కింలోని వివిధ ప్రాంతాలలో వృద్ధులు, మహిళలు, పిల్లలతో సహా పర్యాటకులు చిక్కుకుపోయారని పేర్కొన్నారు. త్రిశక్తి కార్ప్స్ రెస్క్యూ మిషన్ సహాయక చర్యలను చేపట్టిందని తెలిపారు.

నిందితులపై ఉపా కేసులు

- ఏడు రోజుల పోలీసు కస్టడీ
- లోక్‌సభ సెక్రటేరియట్‌కు చెందిన
- 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బుధవారం నాటి ఘటనకు సంబంధించి అరెస్టు చేసిన నలుగురు నిందితులపై పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేశారు. వీరిని గురువారం పాటియాలా హౌస్ కోర్టులో అడిషనల్ సెషన్స్ కోర్టు ఎదుట హాజరుపర్చారు. నిందితులను ముంబై, లక్నోకు తీసుకెళ్లాల్సి ఉందని 15 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయమూర్తి హర్‌దీప్ కౌర్ వారం రోజులకు మాత్రమే అనుమతించారు. ఈఘటనల వెనక ఆరుగురి ప్రమేయం ఉందని, ఐదుగురిని అరెస్టు చేశామని పోలీసులు కోర్టుకు తెలిపారు. అరెస్టయిన వారిలో డి.మనోరంజన్, సాగర్, అమోల్ షిండే, నీలందేవిలను బుధవారం అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు విశాల్‌ను గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు. మరో నిందితుడు లలిత్ కోసం గాలిస్తున్నారు.

పాస్‌లు జారీ అయింది ఇలాగే..

లోక్‌సభ ఘటనలో నిందితులకు బిజెపి మైసూరు ఎంపి ప్రతాప్ సింహా కార్యాలయం నుంచి సందర్శకుల పాస్‌లు జారీ అయ్యాయి. లోక్‌సభలో సందర్శకుల గ్యాలరీ నుంచి దూకిన డి.మనోరంజన్ మైసూరుకు చెందిన వాడని, తరచూ ఎంపి ఆఫీసుకు వస్తుండేవాడని అధికార వర్గాలు తెలిపాయి. విజిటర్స్ పాస్ కోసం మనోరంజన్ మూడు నెలలుగా ఎంపి ఆఫీసును సంప్రదిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆయనతో పాటు సభలో బెంచ్‌లపై నుంచి దూకుతూ స్పీకర్ చాంబర్ వైపు దూసుకెళ్లిన సాగర్ శర్మను మనోరంజన్ తన స్నేహితుడని చెప్పి, పాస్ తీసుకున్నట్లు గుర్తించారు.



సాగర్, నీలందేవి, అమోల్ షిండే, డి.మనోరంజన్,

బుధవారం సింహా తరపున మొత్తం మూడు పాస్‌లు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. మరో మహిళకు పాస్ ఇచ్చినప్పటికీ.. ఆమె తన కుమార్తెతో కలిసి రావడం, చిన్నారి పేరు పాస్‌లో లేకపోవడంతో అనుమతించలేదని ఎంపి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

రెక్కీ నిర్వహించింది మనోరంజనే..

ఈ ఘటన మొత్తానికి వ్యూహకర్త (మాస్టర్‌మైండ్) మనోరంజనేనని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాల సమావేశాల సమయంలో మనోరంజన్ పార్లమెంట్ వద్ద రెక్కీ నిర్వహించినట్లు ఈ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్‌లో సిబ్బంది బూట్లను తనిఖీ చేయడం లేదనే విషయాన్ని అప్పుడే మనోరంజన్ గుర్తించాడు. ఈ ఘటన సమయంలో లలిత్ కూడా పార్లమెంట్ ప్రాంగణంలోనే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పార్లమెంట్ సమీపంలో నీలమ్, అమోల్ ఆందోళన చేస్తుండగా ఆ వీడియోను లలిత్ ఫోన్లో రికార్డ్ చేసినట్లు తెలిసింది. భద్రతా సిబ్బంది వారిని పట్టుకోగానే.. నిందితులందరి ఫోన్లతో లలిత్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఆ వీడియోను పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఎన్‌జిఒ సభ్యురాలికి పంపినట్లు సమాచారం. గతంలో తమతోపాటు ఎన్‌జిఒ సంస్థలో పనిచేసిన లలిత్ ఘటనకు సంబంధించిన వీడియో షేర్ చేసి, వైరల్ చేయాలని మెసేజ్ పెట్టినట్లు ఆమె మీడియాకు తెలిపారు.

బుధవారం పార్లమెంటులో ఇద్దరు దుండగులు పొగబాంబులు పేల్చిన ఘటన అనంతర పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైనవారిలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర మంత్రులు ప్రహ్లాద్ జోషి, అనురాగ్ ఠాకూర్, పియూష్ గోయెల్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తదితరులు హాజరయ్యారు.

భద్రత కట్టుదిట్టం... పార్లమెంట్‌లో ఆంక్షలు

పార్లమెంటు ప్రాంగణం.. బయట అధికారులు భద్రతను పెంచారు. ఢిల్లీ పోలీస్, పారా మిలిటరీ, పార్లమెంట్ స్పెషల్ సెక్యూరిటీ గార్డులతో పహార నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని వ్యక్తులను భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్ పాసులు ఉన్న వారికి మాత్రమే పరిసర ప్రాంతాల్లోకి వెళ్లే అవకాశం పోలీసులు ఇస్తున్నారు. పార్లమెంట్ భవనానికి వెళ్లే మార్గాలన్నింట్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పార్లమెంట్ భవనంలోకి ప్రవేశాలపై ఆంక్షలు విధించారు. ఎంపిలు ప్రవేశించే 'మకర ద్వారం' నుంచి ఇతరులు వెళ్లకుండా నిషేధం విధించారు. మకర ద్వారం వద్ద వంద మీటర్ల దూరంలో ఉండాలని మీడియాపై ఆంక్షలు విధించారు. ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించి మీడియా సిబ్బందికి పాసులు జారీ చేస్తున్నారు. పార్లమెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి బూట్లను కూడా స్కాన్ చేస్తున్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

ఏడు నెలల తరువాత స్వస్థలాలకు మణిపూర్ మృతదేహాలు

ఇంఫాల్ : సుప్రీంకోర్టు తీర్పుతో మణిపూర్ హింసాకాండలో మరణించిన వారి మృతదేహాలను సుమారు ఏడు నెలల తరువాత స్వస్థలాలకు వాయు మార్గంలో తరలించారు. గురువారం 73 మృతదేహాలను తరలించినట్లు అధికారులు చెప్పారు. ఈ ఏడాది మే 3 నుంచి రాష్ట్రంలో హింసాకాండ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మరణించిన వారి మృత దేహాలను ఇంఫాల్, చురచాంద్‌పూర్‌లోని వివిధ ఆసుపత్రుల్లో భద్రపరిచారు. అక్టోబర్ 7 నాటికి 175 మంది మరణించారని, వీటిలో 87 మృతదేహాలను గుర్తించారని, వీటిని కూడా తీసుకోవద్దని బాధిత బంధువులకు బెదిరింపులు వస్తున్నాయని జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. దీంతో మృతదేహాల అంత్యక్రియలకు ఏర్పాటు చేయాలని నవంబర్ 28న మణిపూర్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మృతదేహాలను గుర్తించడానికి బాధిత బంధువులకు వారం రోజుల గడువు ఇవ్వాలని, లేని పక్షంలో ప్రభుత్వమే అంత్యక్రియలను నిర్వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గురువారం భారత వాయు సేనకు చెందిన హెలికాప్టర్లతో 41 మృతదేహాలను ఇంఫాల్ నుంచి చురచాంద్‌పూర్‌కు, మరో 28 మృతదేహాలను ఇంఫాల్ నుంచి కాంగ్‌పోక్పికి



తరలించారు. చురచాంద్‌పూర్ నుంచి నాలుగు మృతదేహాలను ఇంఫాల్‌కు తరలించారు. కాంగ్‌పోక్పికి తరలించిన మృతదేహాలకు శుక్రవారం ఫైజాంగ్ గ్రామంలోని అమరవీరుల శ్మశానవాటికలో సామూహిక అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుల గౌరవ సూచకంగా గిరిజన ఐక్యత కమిటీ శుక్రవారం జిల్లాలో ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. చురచాంద్‌పూర్‌లో కూడా ఈ విధంగానే సామూహిక అంత్యక్రియలు జరుగుతాయని, తేదీ ఇంకా ఖరారు చేయలేదని ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం నాయకులు తెలిపారు.

డిజిటల్ పరికరాల స్వాధీనం మార్గదర్శకాలకు కేంద్రానికి ఆరు వారాల గడువు

న్యూఢిల్లీ : డిజిటల్ పరికరాల స్వాధీనం చేసుకునేందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఖరారు చేసేందుకు కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆరు వారాల సమయం ఇచ్చింది. దర్యాప్తు సంస్థల ద్వారా డిజిటల్ పరికరాలను పరిశీలించడం, స్వాధీనం చేసుకోవడానికి సంబంధించిన సరైన మార్గదర్శకాలు జారీ చేయాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన రెండు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న సంగతి తెలిసిందే. గురువారం ఈ పిటీషన్ల విచారణ సందర్భంగా కేంద్రంపై జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియాలతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్గదర్శకాలను ఖరారు చేసేందుకు మరికొంత సమయం కావాలని కేంద్రం తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) ఎస్‌వి రాజు కోరడాన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. '2021లో పిటిషన్ విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే జరుగుతోంది. మీకు ఇంకా ఎంత సమయం కావాలి. మీరు సమావేశాలు జరుపుతున్నారు. ఫలితం ఎప్పుడు ఉంటుంది' అన్ని ప్రశ్నించింది. దీనికి స్పందించిన ఎఎస్‌జి 'ఆరు వారాల సమయం కావాలని, అప్పటి వరకూ డిజిటల్ పరికరాల స్వాధీనానికి 2020 సిబిఐ మాన్యువల్‌ను దర్యాప్తు సంస్థలు అనుసరిస్తాయి' అని కోర్టుకు తెలిపారు. దీనికి అనుమతించిన కోర్టు కేంద్రానికి ఆరు వారాల సమయం ఇచ్చింది. తదుపరి విచారణను 2024 ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది.

ఓ వైపు యుద్ధం.. మరో వైపు వర్షం, చలి..

- గాజాలో జన జీవితం దుర్భరం

గాజా : ప్రస్తుతం గాజాలో ప్రజల జీవనం అధ్వానంగా ఉంది. ఒకవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గాజాలో నిరంతర వర్షం, చలి పాలస్తీనా కుటుంబాల కష్టాలను మరింత పెంచింది. ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లాల్సి వస్తోంది. ప్రజలు గుడారాల్లో దాక్కుని జీవిస్తున్నారు. అవి కూడా నీటితో నిండిపోతున్నాయి. కుండపోత వర్షాలు పాలస్తీనియన్లకు కొత్త సవాలును సృష్టించాయి. ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలను అనుసరించి, వారు తమ ఇళ్లను వదిలి దక్షిణం వైపు పారిపోవాలని నిర్ణయించుకున్నారు. గాజాలో పరిస్థితి నిరంతరం దిగజారుతోంది. గాజాలో ప్రస్తుత పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం గాజా పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. నీరు, ఆహారం, మందుల కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వర్షాలు, వరదల కారణంగా పరిస్థితి మరింత దారుణంగా మారింది. గాజాలో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. దీని నుండి తప్పించుకోవడానికి వేలాది మంది పాలస్తీనియన్లు దక్షిణం వైపు కారు, ట్రక్కు, గుర్రపు బండి లేదా కాలినడకన పరుగెత్తుతున్నారు. ఇజ్రాయిల్ మారణకాండలో ఇప్పటివరకూ 18,608 మంది పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 50,594 మంది గాయాల పాలయ్యారు. మృతుల్లో అత్యధికులు మహిళలు, పిల్లలే.

89 మంది జర్నలిస్టులు మృతి

ఇజ్రాయిల్ సైన్యం ఇప్పటివరకూ 89 మంది జర్నలిస్టుల్ని హత్య చేసింది. ప్రస్తుత పరిస్థితులపై ప్రపంచానికి సమాచారాన్ని అందజేస్తున్న జర్నలిస్టులను చంపడాన్ని పాలస్తీనియన్ జర్నలిస్ట్స్ సిండికేట్ (పిజెఎస్)



తమ గుడారం వద్ద బురద నీటిని పక్కకు నెట్టుతున్న చిన్నారి

తీవ్రంగా ఖండించింది. ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ వ్యక్తి కాల్పుల్లో గాయపడిన జర్నలిస్ట్ అబేద్ అల్కరీమ్ ఔడా బుధవారం మరణించాడు. ఇజ్రాయిల్ సైన్యం బాంబులతో దాడి చేయడంతో రష్యా టుడేలో ట్రైనీగా పనిచేస్తున్న మరో మహిళా జర్నలిస్ట్ నెర్మిన్ కవాస్ తన ఇంటిలోనే మరణించారు. ఇప్పటివరకు హత్యకు గురైన జర్నలిస్టుల్లో పదిమంది మహిళా జర్నలిస్టులు ఉన్నట్లు పిజెఎస్ గుర్తించింది. వార్తా సంస్థల ప్రధాన కార్యాలయాల్ని కూడా ఇజ్రాయెల్ సైన్యం ధ్వంసం చేసిందని పిజెఎస్ విమర్శించింది. యూరోపియన్ సమ్మిట్ సమావేశంలో పిజెఎస్ అధ్యక్షుడు నాసర్ అబూ బేకర్ మాట్లాడుతూ.. 'గాజాలో నా సహచరులు నీరు, ఆహారం, నివాసం లేక దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. ఇజ్రాయెల్ బాంబు దాడుల కారణంగా చాలామంది జర్నలిస్టులు, వారి కుటుంబాలు నివాసం కోల్పోయి వీధులు, పాఠశాలలు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో ఉంటున్నారు.' అని అన్నారు.

పాలస్తీనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించండి

- ఐక్యరాజ్య సమితికి రష్యా పిలుపు

మాస్కో : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనేందుకు అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ బుధవారం ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్‌ను కోరారు. పాలస్తీనా దేశం ఏర్పడాలని రష్యా కోరుకుంటోంది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమొక్కటే దీనికి గల పరిష్కారమని లావ్‌రోవ్ స్పష్టం చేశారు. భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలతో తక్షణమే సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రష్యన్ సెనెటర్లతో మాట్లాడుతూ ఆయన, ఆ సమావేశంలో అరబ్ లీగ్, ఇస్లామిక్, గల్ఫ్ సహకార మండలికి చెందిన ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. ఇటువంటి సమావేశం ఏర్పాటులో ఐక్యరాజ్య సమితి కీలక పాత్ర పోషించాలన్నారు. ఇటువంటి చొరవ తీసుకునే సామర్థ్యం గుటెరస్‌కు ఉందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. పాలస్తీనియన్లకు నిరంతరంగా అన్యాయం జరుగుతూనే వుందన్నారు. హమాస్ చెరలో వున్న బందీలందరినీ విడిపించేందుకు మాస్కో చేయగలిగిన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

తాళాలు బద్దలు కొట్టినా... అదరం...బెదరం



సిఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. కొన్ని జిల్లాల్లో వైసిపి నాయకులు అంగన్‌వాడీ సంఘాల నాయకులను పిలిపించి బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. అలాగే అవాస్తవాలతో కూడిన ప్రకటనను స్త్రీ, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి విడుదల చేశారని, దీనివల్ల ఇప్పటి వరకూ శాఖకు, సిబ్బందికి మధ్య ఉన్న సత్సంబంధాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఈ మేరకు విజ్ఞాపన పత్రం అందచేశారు. సిఎస్‌ను కలిసిన వారిలో సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, నాయకులు దయా రమాదేవి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి ప్రసాదు, కె పొలారి, టిఎన్‌టియుసి అధ్యక్షులు రఘురామరాజు తదితరులు ఉన్నారు.

ఫ్యాప్టో మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు ఫ్యాప్టో మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం వారితో చర్చించి, సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేసేలా చూడాలని కోరింది. ఈ మేరకు ఫ్యాప్టో ఛైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల ప్రకటన విడుదల చేశారు. చాలా కాలంగా అంగన్‌వాడీలు సమస్యలపై వినతులు సమర్పించినా ప్రభుత్వం తాత్సారం చేసిందని, ఫలితంగా సమ్మె అనివార్యమైందని వారు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల పిల్లలను ప్రాథమిక పాఠశాలలకు ఎటాచ్‌చేసి మిడ్డే మీల్స్ పెట్టాలని ఆదేశాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అసలే ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతుంటే వారిని ఎటాచ్ చేయడం మరింత ఇబ్బందులకు దారితీస్తుందని తెలిపారు. మిడ్డే మీల్స్‌కు అయ్యే ఖర్చుపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్లు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బందికి ఈ పనులు అప్పగించారని, మంత్రులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు మంచిది కాదని హితవు పలికారు. ఫ్యాప్టో కో-ఛైర్మన్లు కె నరహరి, మనోజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రకాష్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ సాయిశ్రీనివాస్, చిరంజీవి, శ్రీనివాసరావు, చింతల సుబ్బారావు, కార్యదర్శులు ఇమామ్ బాషా, మధుసూదనరావు తదితరులు ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు. అంగన్‌వాడీ సమ్మెకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మద్దతు ప్రకటించారు.

లౌడ్ స్పీకర్లపై ఆంక్షలు

- బహిరంగ మాంసం, గుడ్ల విక్రయంపై నిషేధం
- ఎంపి సీఎంగా బాధ్యతల అనంతరం మోహన్ యాదవ్ ఉత్తర్వులు

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోహన్ యాదవ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనుమతించదగిన డెసిబెల్ స్థాయికి మించి మతపరమైన ప్రదేశాలలో లౌడ్ స్పీకర్లను ఉపయోగించడాన్ని నిషేధించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం నుండి వచ్చిన యాదవ్.. బహిరంగంగా మాంసం, గుడ్లు విక్రయించడాన్ని కూడా నిషేధించారు. శబ్ద కాలుష్యం, లౌడ్ స్పీకర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ స్క్వాడ్‌లు లౌడ్ స్పీకర్లను ఉపయోగించే మతపరమైన, బహిరంగ ప్రదేశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తాయి. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎంగా మోహన్ యాదవ్ జారీ చేసిన మొదటి ఉత్తర్వు ఇది అని అదనపు ప్రధాన కార్యదర్శి (హోమ్) డాక్టర్ రాజేష్ రాజోరా తెలిపారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాల మేరకు లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను కూడా తక్షణమే అమలు చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

బిజెపి కార్యకర్తపై దాడి కేసులో నిందితుడి ఇంటి కూల్చివేత

బిజెపి కార్యకర్తపై దాడి చేసిన నిందితుడి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేయాలని అధికారులను కొత్త సిఎం మోహన్ యాదవ్ తొలి ఆదేశాలిచ్చారు. ఈ నెల 3న ఎన్నికల ఫలితాలు వెల్లడైన సమయంలో జరిగిన ఘర్షణలో బిజెపి కార్యకర్త దేవేంద్ర ఠాకూర్ చెయ్యి తెగింది. ఈ కేసులో ఫరూఖ్ రెయిన్‌తోపాటు అస్లాం, షారుక్, బిలాల్, సమీర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. సిఎం ఆదేశాలతో ఫరూఖ్ రెయిన్ ఇంటిని బుల్డోజర్‌తో అధికారులు గురువారం కూల్చివేశారు. కొత్త సిఎం మోహన్ యాదవ్ ఈ మేరకు తొలి ఆదేశం ఇవ్వడం చర్చకు దారి తీసింది.

14మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

13 మంది, రాజ్యసభలో ఒకరిని ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన కాలానికి సస్పెండ్ చేశారు. గురువారం ఉదయం పార్లమెంటు సమావేశం కాగానే బుధవారం నాటి భద్రతా ఉల్లంఘన ఘటనలపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ఇందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో సభలో గందరగోళం ఏర్పడింది. ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకసారి వాయిదా వేశారు. అంతకుముందు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ..“ బుధవారం నాటి ఘటనను అందరూ ఖండిస్తున్నారు. దీనిపై స్పీకర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. పాస్‌లు ఇచ్చే విషయంలో మనం మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం” అని చెప్పారు. దీనిపై ఏమాత్రం సంతృప్తి చెందని ప్రతిపక్ష సభ్యులు హోం మంత్రి సభకు వచ్చి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆయన ముఖం చాటేయడంతో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి

సమావేశమైనప్పుడు భద్రతా వైఫల్యానికి బాధ్యులైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వాన్ని నిలదీయడమే నేరమైనట్లుగా పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఐదుగురు కాంగ్రెస్ ఎంపిలను సస్పెండ్ చేస్తూ ఒక తీర్మానాన్ని తీసుకొచ్చారు. ఆ విధంగా సస్పెన్సన్ వేటు పడినవారిలో టిఎన్ ప్రతాపన్, హిబీ ఈడెన్, ఎస్ జ్యోతిమణి, రమ్య హరిదాస్, డిన్ కురియకోస్ ఉన్నారు. సభా నియమాలను ఉల్లంఘించినందుకు, సభా కార్యకలాపాలకు అడ్డుపడినందుకు ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం సభను మధ్యాహ్నం 3 గంటలవరకు వాయిదా వేశారు. ఆ తరువాత కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మరో తొమ్మిది మంది ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేశారు. వీరిలో కాంగ్రెస్ ఎంపిలు బెన్నీ బెహనన్, వికె శ్రీకందన్, మహ్మద్ జావేద్, మాణికం ఠాగూర్, సిపిఎం ఎంపిలు పిఆర్ నటరాజన్, ఎస్. వెంకటేశన్, డిఎంకె ఎంపిలు కనిమొళి కరుణానిధి, ఎస్ఆర్ పార్థిబన్, సిపిఐ ఎంపి కె. సుబ్బరాయన్ ఉన్నారు. ఆ తరువాత శుక్రవారానికి సభ వాయిదా పడింది.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి. భద్రతా వైఫల్యంపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు తొలుత వాయిదా వేశారు. భద్రతా ఉల్లంఘనలపై చర్చకు పట్టుబడుతూ టిఎంసి పక్షనేత డెరిక్ ఒబ్రెయిన్ సభా మధ్య భాగంలోకి దూసుకెళ్లారు. దానిపై రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వెంటనే డెరెక్‌ను ఈ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. రూల్ 256 (2) ప్రకారం కౌన్సిల్ సర్వీస్ నుంచి సస్పెండ్ చేయబడిన డెరెక్ ఓబ్రెయిన్ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించాలని, ఆయన “క్రమశిక్షణా రాహిత్యాన్ని” హౌస్ ప్రివిలేజెస్ కమిటీకి సూచించాలని, మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత పీయూష్ గోయల్ తీర్మానం తెచ్చారు. ఆ తరువాత సభను మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఒకసారి, 3 గంటలకు ఒక సారి, సాయంత్రం 4 గంటలకు ఒక సారి వాయిదా పడింది. అయినా ఫలితం లేకపోవడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారంటూ సస్పెండ్ చేసిన 14 మందిలో డిఎంకె ఎంపి ఎస్ఆర్ పార్థిబన్ అసలు సభకు హాజరుకానే లేదు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు ఎలా వేస్తారని ప్రతిపక్షాలు నిలదీయడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. పొరపాటున పార్థిబన్ పేరు ఆ జాబితాలో చేర్చామంటూ తరువాత ఆయన పేరును సస్పెండయిన ఎంపీల జాబితా నుంచి తొలగించింది.

పార్థిబన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ సస్పెండయిన ఎంపీల జాబితాలో తన పేరు చేర్చడం పెద్ద “జోక్” అని అన్నారు. తాను అనారోగ్యంతో ఉన్నందున పార్లమెంటుకు వెళ్లలేదని, అయినా తనపై వేటు వేయడం ఆశ్చర్యం కలిగించిందని డిఎంకె ఎంపీ పేర్కొన్నారు.

'ప్రజాస్వామ్యం ఖూనీ': సీతారాం ఏచూరి

ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను “ప్రజాస్వామ్యం ఖూనీ”గా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వ్యాఖ్యానించారు. ఆయన ట్విట్టర్ (ఎక్స్)లో ఈ మేరకు ఒక పోస్టు పెట్టారు. పార్లమెంటు భద్రతా వ్యవహారాల సభా సంఘాన్ని ఇంతవరకు పునర్వ్యవస్థీకరించలేదు. జాయింట్ సెక్రటరీ, సెక్యూరిటీ విభాగాల అధిపతులను నియమించలేదు. చొరబాటుకు స్పాన్సర్ చేసిన బిజెపి ఎంపీని ప్రశ్నించలేదు. కానీ ప్రధాని, కేంద్ర హోం మంత్రి జవాబుదారీతనం కోసం డిమాండ్ చేసినందుకు 15 మంది ప్రతిపక్ష ఎంపిలపై సస్పెన్షన్ వేటు వేశారు.ఇది . ప్రజాస్వామ్యాన్ని ఖూడీ చేయడం కాదా అని ఆయన నిలదీశారు.

అప్రజాస్వామిక చర్య: కాంగ్రెస్

ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌ను రబ్బరు స్టాంప్‌గా కుదించేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ విమర్శించారు. బుధవారం నాటి ఘటనలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసినందుకు ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేయడం భయంకరమైన, అప్రజాస్వామిక చర్య అని అన్నారు. జవాబుదారీతనం కోసం పట్టుబట్టిన ఎంపిలను సస్పెండ్ చేస్తారు. దుండగుల ప్రవేశానికి సహకరించిన బిజెపి ఎంపిపై ఎలాంటి చర్యలు లేవని ఆయన విమర్శించారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌పై తీవ్ర విమర్శలు

ఉద్దానంలో కిడ్నీ సమస్య చంద్రబాబు హయాంలోనూ ఉందని, ఆయన పరిష్కార మార్గం చూపలేదన్నారు. ఎన్నికలు వస్తుండడంతో చంద్రబాబు ఎత్తులు, పొత్తులు, జిత్తులు మొదలుపెట్టారని విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో దత్తపుత్రుడు నిలబెట్టిన అభ్యర్థులకు బర్రెలక్క కన్నా తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. తాను ఎక్కడ ఉండాలో, రాజధాని ఎక్కడ ఉండాలో పక్క రాష్ట్రంలో ఉండి చెప్తున్నారని విమర్శించారు. పలాస పర్యటన సందర్భంగా పలాస-కాశీబుగ్గలో విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. సిఎం ప్రయాణించే మార్గంలో దుకాణాలను మూసివేయించారు.

జీడి మద్దతు ధరకు వినతి

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని జీడి రైతుల సంఘం నాయకులు టి.అజయ్ కుమార్ ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిఎం తన అదనపు కార్యదర్శి ధనంజయరెడ్డికి అప్పగించారు. రైతులతో చర్చలు జరిపేందుకు విజయవాడ రావాలని సూచించినట్లు తెలిసింది. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కొబ్బరి రైతుసంఘం, రైతుసంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఎస్.కృష్ణారావు వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించి

సమ్మెను ఆపించాలి

• సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి సమ్మెను విరమింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లీబిడ్డలకు ఎదురయ్యే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 12 నుండి చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ విచ్ఛిన్న ఎత్తుగడలను ఎదుర్కొని కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా నిలబడాలని, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల తరగతుల ప్రజలు, ప్రజాతంత్రవాదులు అంగన్‌వాడీలకు సంఘీభావంగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. 2019 ఎన్నికల్లో అంగన్‌వాడీలకు తెలంగాణలో ఇస్తున్న వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానని వాగ్ధానం చేసి, ముఖ్యమంత్రి అయ్యాక జగన్ మాట తప్పారని విమర్శించారు. కనీస వేతనం అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి, పెన్షన్ 50 శాతం అమలు చేయాలనే కనీస కోర్కెలు అమలు కోసం నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. కార్మికులు దశలవారీ అనేక రూపాల్లో ఆందోళనల తరువాత విసిగి వేసి చిట్టచివరకు సమ్మెకు దిగారని వివరించారు. ఈ సమ్మెను నివారించే అవకాశం ఉన్నా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేకచోట్ల ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకుంటు న్నారని తెలిపారు. కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు బాధ్యాతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, అంగన్‌వాడీలపై నోరుపారేసుకున్న బొబ్బిలి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్నిచోట్ల వైసిపి కార్యకర్తలు టెంట్లు పీకేస్తున్నారని ఆగ్రహించారు. ఈ చట్ట విరుద్ధ చర్యలను పోలీసులు దగ్గరుండి జరిపిస్తున్నారని, ప్రశాంతంగా సాగుతున్న సమ్మెను శాంతి భద్రతల సమస్యగా మార్చే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ఈ సమ్మెకు పోలీసులు, సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని కోరారు. ప్రశాంతంగా జరిగే సమ్మెను అక్రమ పద్ధతుల ద్వారా విచ్ఛిన్నం చేసే ప్రభుత్వ యత్నాలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞతతో అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవచూపి సమ్మెను విరమింపజేయాలని కోరారు.

బొబ్బిలి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

అంగన్‌వాడీ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై నోరు జారిన బొబ్బిలి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి వి.ఆర్,జ్యోతి కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అంన్‌వాడీల వేతనం 11,770, హెల్పర్లు, మినీవర్కర్లకు రూ.7000 వేతనం మాత్రమేనని, బలిసి లేరని తెలిపారు. రిటైర్మెంట్ అయిన తరువాత అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. దాన్ని అమలు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారని పేర్కొన్నారు. ఒకసారి ఎమ్మెల్యే అయితే కోటీశ్వర్లు అయినా నెలకు రెండు లక్షల జీతం, వారికి జీవితాంతం సుమారు లక్ష రూపాయల పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని పేర్కొన్నారు. ఇది ప్రజల డబ్బేనని, బొబ్బిలి ఎమ్మెల్యే ఎంత పేదవారో అందరికీ తెలిసిందేనని విమర్శించారు. కష్టపడి పేదలకు సేవ చేస్తున్న అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు, రిటైర్ అయిన తరువాత గ్రాట్యూటీ అడగడం తప్పా అని ప్రశ్నించారు. బొబ్బిలి ఎమ్మెల్యేకు ప్రజల పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్నా వారి ప్రభుత్వ మంత్రులతోగానీ, ముఖ్యమంత్రితోగానీ అంగన్‌వాడీల గురించి మాట్లాడాలని, నోరుజారడం ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు


- **అంగన్‌వాడీ సెంటర్‌ల తాళాలు పగలకొట్టిన అధికారులు**
- **అడ్డుకున్న లబ్ధిదారులు, అంగన్‌వాడీలు**
- **బెదిరింపులతో ఆయాకు గుండెపోటు**
- **బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి**
- **రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ కాన్వాయ్ అడ్డగింత**



అనంతపురంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీల సమ్మె విచ్ఛినాన్నికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. సమస్యలను పరిష్కరించకుండా కుట్రలకు పాల్పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టించి, సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది. వారికి సహకారులుగా వలం టీర్లను నియమించింది. కొన్ని చోట్ల సెంటర్ల తాళాలను అధికారులు బద్దలు చేస్తుండగా అంగన్‌వాడీ లబ్ధిదారులు, అంగన్‌వాడీలు అడ్డగించారు. సమస్యలను పరిష్కరించమంటే ఇలా తాళాలు పగులగొట్టడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి అణచివేత చర్యలకు భయపడేది లేదని స్పష్టం చేశారు.



కర్నూలులో అంగన్‌వాడీల ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లాలో తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద సమ్మె శిబిరాలు నిర్వహించారు. యు.కొత్తపల్లిల్లో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగలగొట్టడాన్ని స్థానిక మహిళలు అడ్డుకుని అంగన్‌వాడీలకు బాసటగా నిలిచారు. సీతానగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సచివాలయ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐవి మద్దతుగా పాల్గొని మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడటం తగదన్నారు.

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. శింగనమల మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. హిందూపురంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ర్యాలీ చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, గుమ్మఘట్ట, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని నల్లచెరువు, రొద్దం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టారు. వైఎస్ఆర్ జిల్లాలోని ముద్దనూరు, జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నెలో సెంటర్ల తాళాలు పగలకొట్టారు. ముద్దనూరులో అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు పగలగొట్టడంపై ఎస్ఐకి అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. పోరుమామిళ్లలో బొబ్బిలి ఎమ్మెల్యే దిష్టబొమ్మను దగ్ధం చేశారు.

శ్రీకాకుళంలో అంగన్‌వాడీ లబ్ధిదారులు తమ పిల్లలను తీసుకుని సమ్మె శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. చిత్తూరు జిల్లాల్లోని 11 ప్రాజెక్టులో సచివాలయ సిబ్బందిని రెవెన్యూ అధికారులు వెంటబెట్టుకొని సాయంత్రం నాలుగు గంటల సమయంలో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. కొన్నిచోట్ల లబ్దిదార్లు, అంగన్‌వాడీలు అడ్డుకోవడంతో వెనుదిగారు. మరికొన్ని ప్రాంతాల్లో బలవంతంగా తాళాలు పగలగొట్టి సెంటర్లలోకి ప్రవేశించారు. ఏలూరు జిల్లా పెదపాడులో నోట్లో పచ్చగడ్డి, ఎండు గడ్డి పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జగదాంబ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. లక్కవరం అంగన్‌వాడీ కేంద్రం తాళా లను అధికారులు పగలగొట్టారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర, ఆచంట మండలాల్లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్‌లో దీక్షలు చేపట్టారు. దీక్షలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే పోరాటం కొనసాగించాలని అంగన్‌వాడీలను కోరారు. నెల్లూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఐసిడిఎస్ పీడీ ఆఫీసు, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోనూ ఆందోళనలు కొనసాగాయి.

అంగన్‌వాడీలపై బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని కోరుతూ పలుచోట్ల రాస్తారోకోలు చేశారు. అధికారుల ఆదేశాలతో విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం పట్టణాలతోపాటు పలు మండలాల్లో సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచారు. బొబ్బిలి పట్టణంలో 46 కేంద్రాలను తెరించారు. జామి మండల కేంద్రంలో అల్లువీధి పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యాన తెరిచేందుకు ప్రయత్నించగా, చిన్నారుల తల్లిదండ్రులు అడ్డుకున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేట, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ తాళాలు పగలగొట్టి, సచివాలయాల సిబ్బందికి అప్పగించారు. అనకాపల్లి జిల్లా మునగపాక అంగన్‌వాడీ కేంద్రం తాళం కప్పను సచివాలయ కానిస్టేబుల్ పగలగొట్టి తలుపులను తెరిచే ప్రయత్నం చేయగా విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు అడ్డుకున్నారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం సుజనకోట, కిలగడ, అనంతగిరి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం - 2, రాజవొమ్మంగి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం - 2 తాళాలను బద్దలు కొట్టి లోపలకు వెళ్లేందుకు అధికారులు ప్రయ త్నించగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. చింత పల్లిలో రాష్ట్ర ఫుడ్ కమిటీ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి కాన్వాయ్‌ను అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు.

అధికారుల బెదిరింపులతో ఆయాకు గుండెపోటు

అధికారుల బెదిరింపులతో శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఓ అంగన్ వాడీ ఆయా గుండెపోటుకు గురయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇవ్వాలని, ఇకపై విజల సాయంతో అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని ఐసిడిఎస్ సూపర్ వైజర్ బెదిరింపులకు దిగారు. ఈ మాట లతో చిలమత్తూరు అంగన్‌వాడీ కేంద్రం ఆయా పార్వతమ్మ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఛాతిలో నొప్పితో కుప్పకూలిపోయారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.



శ్రీకాకుళంలో పిల్లలతో కలిసి సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న అంగన్‌వాడీ లబ్ధిదారులు

సమస్యలు పరిష్కరించకుంటే తెలంగాణ గతే

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. జగన్‌మెహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధం ప్రయోగించడం ద్వారా ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఉద్యోగ, ఉపాధ్యాయ, సిఐటియు, ఇతర సంఘాల నేతలు సంఘీభావం తెలిపి, సమ్మెలో పాల్గొన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించకుండా మొండికేసినట్లయితే తెలంగాణ గతే పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసుబ్బరావమ్మ మాట్లాడుతూ... సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి మహిళలు రిటన్‌గిఫ్ట్ ఇస్తారని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, ఎఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ...అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతునివ్వడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68